మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...


# నేటి ఈవార్తలు
NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 14-1-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 196 Issue: 196

14 జనవరి 2026 - బుధవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:53 సూర్యాస్తమయం - సా. 5:57 తిథి ఏకాదశి సా. 5:51 వరకు తరువాత ద్వాదశి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం అనురాధ రా. 2:560 వరకు తరువాత జ్యేష్ఠ యోగం గండ రా. 7:50 వరకు కరణం భాలవ సా. 5:51 వరకు కౌలవ ఉ. 7:060 వరకు వర్జ్యం లేదు దుర్ముహూర్తం మ. 12:02 నుండి మ. 12:47 వరకు రాహుకాలం మ. 12:25 నుండి మ. 1:48 వరకు యమగండం ఉ. 8:16 నుండి ఉ. 9:39 వరకు గుళికాకాలం ఉ. 11:02 నుండి మ. 12:25 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:17 నుండి ఉ. 6:05 వరకు అమృత ఘడియలు మ. 3:22 నుండి సా. 5:10 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com



## 10 నిమిషాల డెలివరీ బంద్

### డెలివరీ బాయ్స్‌కు కేంద్రం గుడ్ న్యూస్

**కార్మిక శాఖ ఆందోళన.. సంస్థల ప్రతినిధులతో మాండవీయ భేటీ**

న్యూఢిల్లీ: డెలివరీ రంగంలో తీవ్ర విమర్శలకు దారితీసిన 10 నిమిషాల డెలివరీ విధానానికి బైబై చెప్పాల్సిన టైం వచ్చింది. డెలివరీ పార్ట్‌నర్ల (గిగ్ వర్కర్లు) భద్రత, సంక్షేమంపై వెల్లువెత్తిన ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకుంది. బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ, జొమాటో వంటి ప్రముఖ క్విక్ కామర్స్ తరువాయి 2 వ పేజీలో...



## కుక్క కాటు.. రాష్ట్రాలకు దెబ్బ!

### గాయపడ్డవారికి రాష్ట్రాలే పరిహారం చెల్లించాలి


**ప్రతి కుక్క కాటుకు భారీగా ఫైన్.. హెచ్చరించిన సుప్రీం కోర్టు**

న్యూఢిల్లీ: వీధి కుక్కల కేసు విచారణలో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజలను కుక్కలు కరిస్తే పూర్తి బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టం చేసింది. ప్రతి కుక్క కాటుకు రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా ఫైన్ చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించింది. వీధి కుక్కలకు ఆహారం పెట్టేవారికీ సుప్రీం ధర్మాసనం వార్నింగ్ ఇచ్చింది. కుక్కలకు ఆహారం ఇచ్చేవారు వాటిని వారి ఇంట్లో పెంచుకోవాలని, కుక్కకాటుకు తరువాయి 2 వ పేజీలో...



## సజ్జనార్‌కు హెచ్చార్సీ నోటీసులు

హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): చైనా మాంజాకు సంబంధించి హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్‌కు తెలంగాణ మానవ హక్కుల కమిషన్ నోటీసులు జారీ చేసింది. రామారావు ఇమ్మానేని అనే న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా పరిగణించింది. చైనా మాంజాకు సంబంధించి తక్షణమే నివేదిక -2 వ పేజీలో...



## చైనా మాంజా.. మృత్యుపంజా

### చర్మాన్ని చీరేస్తున్న చైనా దారం

**పతంగుల పండుగ వేళ విషాదాలు.. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు**

**నిషేధం ఉన్నా విచ్చలవిడి అమ్మకాలు.. చోద్యం చూస్తున్న ప్రభుత్వం!**

(ఈవార్తలు ప్రత్యేకం)

సంక్రాంతి అంటేనే ఆకాశంలో రంగురంగుల పతంగుల సందడి. పిల్లల కేరింతలు, పెద్దల ఉత్సాహం మధ్య ఆనందంగా గడవాల్సిన పండుగ.. నేడు 'చైనా మాంజా' రూపంలో మృత్యుఘోషగా మారుతోంది. కేవలం తన గాలిపటం తెగకూడదనే స్వార్థంతో ఒక వ్యక్తి వాడే నైలాన్/సింథటిక్ దారం, మరో వ్యక్తి ప్రాణాన్ని బలితీసుకుంటోంది. నిజానికి, దీనిని చైనా మాంజా అని పిలిచినప్పటికీ, ఇది నైలాన్, ప్లాస్టిక్ పదార్థాలతో తయారైన అత్యంత ప్రమాదకరమైన సింథటిక్ దారం. దీనిపై గాజు పొడిని పూయడం వల్ల ఇది ఒక పదునైన కత్తిలా తరువాయి 2 వ పేజీలో...



## 16న 'పుర' నగారా!?

### వార్డుల వారీగా ఓటర్ల మ్యాపింగ్ పూర్తి

**మున్సిపల్ పరిధిలో 52.43 లక్షల ఓటర్లు**

**పురుషుల కన్నా మహిళా ఓటర్లదే ఆధిపత్యం**



రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పనలో కీలక ఘట్టాన్ని పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ ముగిసినట్లు ఎస్ఈసీ అధికారికంగా ప్రకటించింది.

హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): 2,996 వార్డుల్లో ఓటర్ల నిర్ధారణ పూర్తయిందని, దీని ప్రకారం మున్సిపల్ పరిధిలో మొత్తం 52.43 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. ఈ ఓటర్ల గణాంకాలను పరిశీలిస్తే, పురుషుల కంటే మహిళా ఓటర్లే ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు. రాష్ట్ర మున్సిపాలిటీల్లో పురుష ఓటర్లు 25.62 లక్షలు ఉండగా, మహిళా ఓటర్లు 26.80 లక్షల మంది ఉన్నారు. అంటే పురుషుల కంటే దాదాపు 1.18 లక్షల మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక ఇతర కేటగిరీ (థర్డ్ జెండర్) ఓటర్లు 640 మందిగా నమోదయ్యారు. మున్సిపల్ కార్పొరేషన్ల తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,253 |
| వెండి (గ్రాము): | రూ.292 |
| ప్లాటినం (గ్రాము): | రూ.67,64 |

## మేడారంలో గుడిమెలిగే!

### నేడే మహాజాతరలో తొలి ఘట్టం నిర్వహణ

**ఆలయ, పూజాసామగ్రి శుద్ధి కార్యక్రమం.. దారి పడుతున్న వివిధ రాష్ట్రాల గిరిజనులు**



మేడారం మహాజాతరలో తొలి ఘట్టానికి వేళైంది. బుధవారం గుడిమెలిగే పండుగతో మహాజాతర పనులు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా పూజారులు మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలో ఉన్న సారలమ్మ ఆలయాలు, పూజా సామగ్రిని శుద్ధి చేసి అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ పండుగతో మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతర తొలిపూజ ప్రారంభం కానుంది.

ములుగు, జనవరి 13 (ఈవార్తలు): ఒక్కప్పుడు మేడారంలోని సమ్మక్క, కన్నెపల్లిలోని సారమ్మలకు గుళ్లుగా గుడిసెలు ఉండేవి. జాతర ముందు ఈ గుడిసెలకు మరమ్మతులు చేసేవారు. గుడిసెలకు కొత్తగా పైకప్పు అమర్చడం (కప్పడం) చేసేవారు. దీన్నే గుడి మెలగడం అంటారు. ఈ ప్రక్రియతోనే జాతర తొలిపూజ కార్యక్రమా లు మొదలయ్యేవి. ఇప్పుడు గుడిసెలు లేవు. వీటి స్థానంలో భవనాలు కట్టారు. గుడిసెలు లేకున్నా.. జాతరకు రెండు వారాల ముందు గుడిమెలిగె కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే తరువాయి 2 వ పేజీలో...




## నెట్‌ఫ్లిక్స్- కేంద్రం జత

### భారత ఆవిష్కరణలకు చేయూత

భారత ప్రభుత్వ ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వైజర్ కార్యాలయం, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కలిసి ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌తో కీలక భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. 'ఆత్మనిర్భర్ భారత్ణ స్ఫూర్తికి అనుగుణంగా 'ఇన్‌స్పైరింగ్ ఇన్నోవేటర్స్ - నయే భారత్ కీ నయీ పెహచాన్ణ పేరుతో ఒక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని మంగళవారం సంయుక్తంగా ప్రారంభించాయి.

న్యూఢిల్లీ: కథల ద్వారా నైపుణ్యాలను, స్టార్టప్‌లను ప్రోత్సహించి దేశంలో ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమం కింద, సామాజిక ప్రయోజనం లక్ష్యంగా పనిచేస్తున్న 8 భారతీయ స్టార్టప్‌లను పీఎస్ఏ కార్యాలయం ఎంపిక చేసింది. ఈ స్టార్టప్‌ల విజయగాథలను దేశంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, సత్యజిత్ రే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ సహా 8 ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు యానిమేటెడ్ లఘుచిత్రాలుగా తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



1.1 మెగావాట్ విద్యుత్తును ఉత్పత్తి చేసే లక్ష్యంగా జపాన్ తొలి టర్బైన్‌ను నీటి లోపల అమర్చింది. నాగాసాకి ప్రాంతంలోని గోటో ఐలాండ్‌లో ఏఆర్1100 టర్బైన్‌ను ఏర్పాటు చేసింది. ఇది పునరుత్పాదక ఇందన ఉత్పత్తిలో గొప్ప అడుగుగా మిగిలిపోనుంది.

## 60 కోట్ల స్కాం

**9 జిల్లాల్లో రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు.. 14 రైస్ మిల్లులపై క్రిమినల్ కేసులు**



హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): తెలం గాణలో భారీ కుంభకోణం వెలుగుచూసింది. పేదలకు పంపిణీ చేయాల్సిన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న రైస్ మిల్లులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొరడా ఝళిపించారు. 9 జిల్లాల్లోని 19 రైస్ మిల్లులపై ఏకకాలంలో జరిపిన ఆకస్మిక తనిఖీల్లో రూ.60 కోట్లకు పైగా విలువైన ధాన్యం దారి మళ్లినట్లు గుర్తించారు. ఈ అక్రమాలకు సంబంధించి 14 మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయగా, ఒక తరువాయి 2 వ పేజీలో...

## 'షిట్'పై సిట్!

**సీఎం, మినిస్టర్, ఐఏఎస్‌పై అసభ్య కంటెంట్ ఎఫెక్ట్**

**ఫేక్ న్యూస్‌లపై దర్యాప్తునకు డీజీపీ ఆదేశాలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఓ మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారిణిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అవమానకరమైన, అసభ్యకరమైన కంటెంట్ పోస్ట్ చేసిన రెండు కేసుల దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.

హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): ఈ కేసుల లోతైన విచారణ కోసం డీజీపీ శివధర్ రెడ్డి 8 మంది సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఈ సిట్‌కు నేతృత్వం తరువాయి 2 వ పేజీలో...



## హే సిరి.. అదిగో జెమినీ!

ఆపిల్, గూగుల్ మధ్య కీలక ఒప్పందం 2

ఈవార్తలు


## రాశి ఫలాలు

14.1.2026

మేషం: చిన్ననాటి మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆప్తుల నుండి శుభవార్తలు అందుతాయి. వ్యాపారాలలో నూతన లాభాలు అందుతాయి. సంఘంలో ప్రముఖులతో చర్చలు అనుకూలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

వృషభం: వృత్తి వ్యాపారాలలో ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దూర ప్రయాణాలు అనుకూలిస్తాయి. ఉద్యోగాలలో ఆశించిన అభివృద్ధి కలుగుతుంది. కొన్ని వ్యవహారాలలో స్థిరమైన ఆలోచనలు ముందుకు సాగుతారు. బంధువులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి.

మిధునం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా పడుతాయి. వృత్తి వ్యాపారాల నిరాశ కలిగిస్తాయి. నిరుద్యోగ యత్నాలు కలిసిరావు. మిత్రులతో ఆర్థిక విషయంలో విబేధాలు కలుగుతాయి. గృహనిర్మాణ ప్రయత్నాలు మందగిస్తాయి.

కర్కాటకం: భూ క్రయ విక్రయాలు లాభిస్తాయి. వృత్తి, ఉద్యోగాలలో నూతన ప్రోత్సహకాలు అందుతాయి. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం పొందుతారు. గృహమున కొన్ని విషయాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. సన్నిహితుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారమున నష్టాలు భర్తీ అవుతాయి.

సింహం: సోదరులతో గృహ వాతావరణం సందడిగా ఉంటుంది. బందు మిత్రుల సహకారంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. సంతనానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. స్థిరస్తి వివాదాలు తొలగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో అప్రయత్న కార్య సిద్ధి కలుగుతుంది.

కన్య: ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారించటం మంచిది. చిన్ననాటి మిత్రుల నుండి వ్యతిరేకత పెరుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన మానసికంగా బాధిస్తుంది. వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణించవు. ఆర్థిక వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి. జీవిత భాగస్వామితో మాటపట్టింపులు ఉంటాయి.

తుల: వృత్తి వ్యాపారాలు స్థిరంగా రాణించవు. పాత రుణాలు తీర్చడానికి నూతన రుణ ప్రయత్నాలు చేస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారుల నుండి వ్యతిరేకత పెరుగుతుంది. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వృధా ఖర్చులు అధికమౌతాయి.

వృశ్చికం: వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఉద్యోగస్థులకు హొదాలు పెరుగుతాయి. సన్నిహితుల సహాయంతో దీర్ఘ కాలిక వివాదాల నుండి బయట పడతారు. బంధు మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

ధనస్సు: కీలక వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. కుటుంబ సభ్యుల ప్రవర్తన కొంత ఆందోళన కలిగిస్తుంది. ఉద్యోగమున విలువైన పత్రాల విషయంలో జాగ్రత్త అవసరం. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. ఇంటా బయట గందరగోళ పరిస్థితులుంటాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

మకరం: ఉద్యోగాలలో స్థిరమైన ఆలోచనలు కలసివస్తాయి. గృహమున శుభకార్యాలు నిర్వహిస్తారు. అవసరానికి చేతిలో ధనం నిల్వ ఉంటుంది. వృత్తి వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. ఉద్యోగమున ఉత్సాహకర వాతావరణం ఉంటుంది. చేపట్టిన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

కుంభం: నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహ పరుస్తాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలలో అతి కష్టంతో అల్ప ఫలితాన్ని పొందుతారు. ఉద్యోగమున మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభించదు.

మీనం: విలువైన గృహెూపకరణాలు కొనుగోలు చేస్తారు. దూరపు బంధువుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. చిన్ననాటి మిత్రులతో దైవ సేవకార్యక్రమాలలో పాల్గొంటారు.

# చైనా మాంజా.. మృత్యుపంజా

మొదటి పేజీ తరువాయి

మారుతుంది. సాధారణ నూలు దారంలా ఇది తెగదు. గాలిలో వేలాడుతున్న ఈ దారం ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి మెడకు చుట్టుకున్నప్పుడు, సెకన్ల వ్యవధిలోనే గొంతును కోసేస్తోంది. తాజాగా, ఉప్పల్‌లో మాంజా తగిలి.. ఏఎస్ఐ మెడకు తీవ్ర గాయమైంది. దీంతో, అతడిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. నగరంలోని నల్లకుంట పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ నాగరాజు మాంజా కారణంగా గాయపడ్డారు. ఎగ్జిబిషన్ డ్యూటీ కోసం ఉప్పల్‌లోని తన ఇంటి నుంచి బయలుదేరిన సమయంలో ఈ ఘటన జరిగింది. ఉప్పల్ పీఎస్ పరిధిలోని సౌత్ స్వరూప్ నగర్ వద్ద మాంజా ఆయన మెడకు చుట్టుకుని గొంతుకు తీవ్ర గాయామైంది. వెంటనే ఆయనను ఎల్బీనగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### ఖివిచ్చలవిడి విక్రయాలు

చైనా మాంజాపై నిషేధం ఉన్నప్పటికీ, సంక్రాంతి పండుగను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు చైనా మాంజా విక్రయాలను విచ్చలవిడిగా కొనసాగిస్తున్నారు. పోలీసులు భారీ తనిఖీలు నిర్వహిస్తున్నా.. రహస్య గోదాముల్లో, కిరాణా షాపుల వెనుక భాగంలో, వాట్సాప్ గ్రూపుల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. పోలీసులు కోట్లాది రూపాయల విలువైన స్టాక్‌ను స్వాధీనం చేసుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో దీని వాడకం తగ్గడం లేదు. ఇప్పటికే హైదరాబాద్‌లో రూ.1.24 కోట్ల విలువైన మాంజాను స్వాధీనం చేసుకుని 143 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.

### చైనా మాంజా ఎందుకు ప్రమాదకరం?

దీనిని నైలాన్ లేదా ప్లాస్టిక్ దారంతో తయారు చేసి, దానిపై గాజు ముక్కల పొడి లేదా లోహపు పొడిని పూస్తారు. ఇది చర్మాన్ని చాలా లోతుగా కోసేస్తుంది. సాధారణ నూలు దారంలా ఇది త్వరగా తెగదు. దీనివల్ల గొంతుకు లేదా చేతులకు చుట్టుకున్నప్పుడు ప్రాణాపాయం సంభవిస్తుంది. ఈ దారంలో లోహపు పొడి ఉండటం వల్ల, విద్యుత్ తీగలకు తగిలినప్పుడు కరెంటు షాక్ కొట్టే అవకాశం ఉంది. గాలిలో ఎగిరే పక్షుల రెక్కలు ఈ మాంజాకు తగిలితే అవి తెగిపోయి మరణిస్తాయి.

### చైనా మాంజాపై నిషేధం

తెలంగాణ ప్రభుత్వం, జాతీయ హరిత ట్రిబ్యునల్ చైనా మాంజా అమ్మకం, నిల్వ, వాడకంపై పూర్తి నిషేధం విధించాయి. చైనా మాంజా విక్రయించినా లేదా వాడినా 5 ఏళ్ల జైలు శిక్ష లేదా 1 లక్ష రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంది. ఒకవేళ చైనా మాంజా వల్ల ఎవరైనా మరణిస్తే, దానిని విక్రయించిన లేదా వాడిన వారిపై హత్యాయత్నం లేదా హత్య (బీఎన్ఎస్ సెక్షన్106) కింద కేసులు నమోదు చేస్తారు.

### ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాలు:

**హైదరాబాద్ (నల్లకుంట):**

ఈ నెల 13న నల్లకుంట పోలీస్ స్టేషన్‌కు చెందిన అసిస్టెంట్ సబ్-ఇన్స్పెక్టర్ బీ నాగరాజు విధుల కోసం వెళ్తుండగా చైనా మాంజా గొంతుకు చుట్టుకుని తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

**హైదరాబాద్ (మీర్‌పేట):**

మీర్‌పేటలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఒక మహిళ కాలికి చైనా మాంజా చుట్టుకోవడంతో లోతైన గాయమై, తీవ్ర రక్తస్రావం జరిగింది.

**హైదరాబాద్ (గచ్చిబౌలి-హాఫీజ్‌పేట):**

బైక్‌పై వెళ్తున్న చైతన్య అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గాలిలో వేలాడుతున్న మాంజా వల్ల తీవ్రంగా గాయపడ్డారు. మాంజా చేతికి చుట్టుకోవడంతో చర్మం కత్తిలా కోసుకుపోయింది.

**ఇండోర్ (మధ్యప్రదేశ్):**

జనవరి 11, 2026న రఘువీర్ ధాకడ్ అనే వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా గొంతు కోయడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అంతకుముందు కూడా అదే నగరంలో ఒక 16 ఏళ్ల బాలుడు ఇదే మాంజా వల్ల ప్రాణాలు కోల్పోయాడు.

# 16న 'పుర' నగారా!?

మొదటి పేజీ తరువాయి

వారీగా చూస్తే, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అత్యధికంగా 3,48,051 ఓటర్లతో మొదటి స్థానంలో నిలిచింది. దీని తర్వాతి స్థానాల్లో కరీంనగర్ (3,40,580), మహబూబ్‌నగర్ (1,97,841), రామగుండం (1,83,049) మరియు మంచిర్యాల (1,81,778) కార్పొరేషన్లు ఉన్నాయి. కాగా, అత్యల్పంగా ములుగు జిల్లాలోని ములుగులో కేవలం 13,963 మంది ఓటర్లు మాత్రమే ఉన్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఓటర్ల మ్యాపింగ్ పూర్తి కావడంతో, ఈ నెల 16న ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

# సజ్జనార్‌కు హెచ్చార్సీ నోటీసులు

మొదటి పేజీ తరువాయి

సమర్పించాలని సీపీని ఆదేశించింది. సంక్రాంతి పండుగ సమయంలో చైనా మాంజా ప్రాణాంతకంగా మారుతోన్న విషయం తెలిసిందే. ఈ అంశంపై న్యాయవాది రామారావుతో పాటు పలువురు ఇతర న్యాయవాదులు మానవ హక్కుల కమిష న్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మాంజా అమ్మకాలను, వినియోగాన్ని నిరోధించడానికి తీసుకుంటున్న చర్యలపై సమగ్ర నివేదికను అందించాలని సీపీని మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. ఫిబ్రవరి 26వ తేదీలోగా పోలీసులు చేపట్టిన చర్యల నివేదికను సమర్పించాలని స్పష్టం చేసింది.

# 'షిట్'పై సిట్!

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఓ మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారిణిని లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అవమానకరమైన, అసభ్యకరమైన కంటెంట్ పోస్ట్ చేసిన రెండు కేసుల దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.

# నెట్‌ఫ్లిక్స్- కేంద్రం జత

మొదటి పేజీ తరువాయి

రూపొందించారు. నెట్‌ఫ్లిక్స్ ఫండ్ ఫర్ క్రియేటివ్ ఈక్విటీ సహకారంతో గ్రాఫిటీ స్టూడియోస్ ఈ ప్రాజెక్టును అమలు చేసింది. ఈ చిత్రాలకు అవసరమైన వాయిస్‌ఓవర్‌లను, నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భాగస్వామ్యంతో నెట్‌ఫ్లిక్స్ నిర్వహిస్తున్న 'వాయిస్‌బాక్స్ స్కిల్లింగ్ ప్రోగ్రాం అభ్యర్థులు అందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన 26 మంది విద్యార్థులలో 50 శాతం మహిళలు ఉండగా, పలువురు ద్వితీయ శ్రేణి నగరాల నుంచి రావడం గమనార్హం.

## ఆపిల్, గూగుల్ మధ్య కీలక ఒప్పందం

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజాలైన ఆపిల్, గూగుల్ మధ్య ఓ సంచలన ఒప్పందం కుదిరింది. ఆపిల్ ఉత్పత్తుల్లో కీలకమైన వర్చువల్ అసిస్టెంట్ 'సిరి'తో పాటు ఇతర 'ఆపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్లకు ఇకపై గూగుల్ జెమిని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించనున్నారు. ఈ మేరకు ఇరు సంస్థలు బహుళ సంవత్సరాల భాగస్వామ్యాన్ని అధికారికంగా ప్రకటించాయి. ఆపిల్ సొంతంగా అభివృద్ధి చేస్తున్న ఫౌండేషన్ మోడల్స్ పనితీరు ఆశించిన స్థాయిలో లేకపోవడం, సిరి అప్‌డేట్‌లో జాప్యం జరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మార్కెట్లో అందుబాటులో ఉన్న ఏఐ టెక్నాలజీలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, తమ ఫౌండేషన్ మోడల్స్‌కు గూగుల్ జెమిని అత్యంత సమర్థవంతమైన పునాదిని అందిస్తుందని ఆపిల్ నిర్ధారించుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా, యూజర్ల డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, ఆపిల్ ప్రైవసీ నిబంధనలకు అనుగుణంగానే ఆన్-డివైస్, ప్రైవేట్ క్లౌడ్ కంప్యూట్ ద్వారా డేటాను ప్రాసెస్ చేస్తామని ఇరు కంపెనీలు సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశాయి.

# 60 కోట్ల స్కాం

మొదటి పేజీ తరువాయి

మిల్లును మూసివేశారు. ప్రభుత్వం రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు (కస్టమ్ మిల్లింగ్ రైస్ - సీఎంఆర్) రైస్ మిల్లులకు కేటాయిస్తుంది. ఈ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా పేదలకు అందిస్తుంది. అయితే, జనవరి 12న మహబూబాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సూర్యాపేట, నల్లగొండ, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని మిల్లులపై దాడులు జరిగాయి. ఈ తనిఖీల్లో 14 మిల్లుల్లో అక్రమాలు జరిగినట్లు తేలింది. మొత్తం 1.90 లక్షల క్వింటాళ్ల ధాన్యం, 1.72 లక్షల బస్తాలు మాయమైనట్లు అధికారులు నిర్ధారించారు. ప్రధానంగా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో రూ.19.73 కోట్లు, సూర్యాపేటలో రూ.19.32 కోట్లు, నారాయణపేటలో రూ.15.91 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు తేలింది. అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. నష్టాన్ని రాబట్టాలని, వారి లైసెన్సులను రద్దు చేసి, బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని పౌరసరఫరాల శాఖకు సిఫార్సు చేశారు. తీవ్రమైన ఉల్లంఘనల కారణంగా పెద్దపల్లి జిల్లా, సుల్తానాబాద్ మండలం, పూసాల గ్రామంలోని జానకీరామ ఇండస్ట్రీస్‌ను మూసివేశారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగాన్ని ఏమాత్రం సహించబోమని విజిలెన్స్ డీజీ శిఖా గోయల్ స్పష్టం చేశారు. "నిఘా వర్గాల సమాచారంతోనే ఈ దాడులు నిర్వహించి భారీ మోసాన్ని బయటపెట్టాం. మరో ఐదు మిల్లులకు రికార్డుల నిర్వహణలో లోపాలపై నోటీసులు జారీ చేశాం" అని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. అయితే, ఇలాంటి అక్రమాలు ప్రభుత్వ లక్ష్యాలకు గండికొడుతున్నాయి. భవిష్యత్తులోనూ తనిఖీలు కొనసాగుతాయని, ఎవరైనా అక్రమాలను గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్ 14432కు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

## కుక్క కాటు.. రాష్ట్రాలకు దెబ్బ!

మొదటి పేజీ తరువాయి

వారే బాధ్యత వహించాలని చెప్పింది. వీధి కుక్కల సంక్షేమం, నియంత్రణపై గత కొద్దిరోజులుగా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది.. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా , జస్టిస్ ఎన్వి అంజరియా నేతృత్వంలోని ధర్మాసనం.. మంగళవారం జరిగిన విచారణలో ఈ వ్యాఖ్యలు చేసింది. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా కుక్కకాటుకు బలి అవుతున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.. ఇకపై ప్రతికుక్క కాటుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. ప్రతి కుక్కకాటుకు భారీ ఫైన్ చెల్లించేలా తాము నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపింది. మరోవైపు వీధికుక్కలకు ఆహారం అందించే వారు కూడా బాధ్యులవుతారని సుప్రీంకోర్టు హెచ్చరించింది. కుక్కలకు ఫీడ్ ఇచ్చేవారు వాటిని వారి ఇండ్లలో పెంచుకోవచ్చన్నారు. కుక్కకాటు కు వీరు కూడా బాధ్యులే అవుతారని తెలిపింది. గత వారంలో మూడు రోజులుగా వీధి కుక్కల సంక్షేమం, నియంత్రణపై విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు.. బహిరంగ ప్రదేశాల్లో వీధికుక్కలు ఉనికిని పరిశీలించింది. వీధి కుక్కల నిర్వహణలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమైనట్లు గుర్తించింది. ఏబీసీ నిబంధనల అమలు సరిగా లేదని పేర్కొంది. వీధికుక్కలను తాము ఎప్పుడు తొలగించాలని ఆదేశించలేదని .. అవి కేవలం వన్యప్రాణులకు హానీ చేస్తాయని మాత్రమే హెచ్చరించామని కోర్టు స్పష్టం చేసింది.

## 10 నిమిషాలడెలివరీ బంద్

మొదటి పేజీ తరువాయి

సంస్థలు ఈ వేగవంతమైన డెలివరీ హామీని ఇకపై తమ యాడ్స్‌లో, బ్రాండింగ్‌లో ఉపయోగించకూడదని నిర్ణయించాయి. వివరాల్లోకి వెళితే, కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం న్యూఢిల్లీలో క్విక్ కామర్స్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. గడువులోగా డెలివరీ చేయాలనే తీవ్ర ఒత్తిడితో డెలివరీ సిబ్బంది రోడ్లపై ప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నారని, వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి ఈ సందర్భంగా సూచించారు. డెలివరీ సమయానికి సంబంధించిన కఠిన నిబంధనలను తొలగించాలని ఆయన కోరారు. మంత్రి సూచనకు కంపెనీలు సానుకూలంగా స్పందించి, ఈ హామీని స్వచ్ఛందంగా తొలగిస్తామని హామీ ఇచ్చాయి. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే, ప్రముఖ సంస్థ బ్లింకిట్ తన బ్రాండింగ్‌ను మార్చేసింది. 10,000కు పైగా ఉత్పత్తులు 10 నిమిషాల్లో డెలివరీ అనే పాత ట్యాగ్‌లైన్‌ను తొలగించి, దాని స్థానంలో 30,000కు పైగా ఉత్పత్తులు మీ ఇంటి వద్దకే అనే కొత్త ట్యాగ్‌లైన్‌ను చేర్చింది. ఈ మార్పు ద్వారా డెలివరీ వేగం కంటే సేవల నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు సంకేతాలిచ్చింది. గత కొంతకాలంగా 10 నిమిషాల డెలివరీ విధానంపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తమ భద్రత, వేతనాల గురించి గిగ్ వర్కర్ల యూనియన్లు, ముఖ్యంగా ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్-బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ వంటి సంస్థలు ఆందోళనలు, సమ్మెలు కూడా నిర్వహించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ జోక్యం ప్రాధాన్యం సంతరించుకుంది. బ్లింకిట్ బాటలోనే జెప్టో, స్విగ్గీ, జొమాటో వంటి ఇతర సంస్థలు కూడా రానున్న రోజుల్లో తమ బ్రాండింగ్‌లో మార్పులు చేయనున్నట్టు తెలుస్తోంది.

# మేడారంలో గుడిమెలిగే!

మొదటి పేజీ తరువాయి

మేడారం సమ్మక్క--సారలమ్మ మహా జాతర ఈసారి ఎన్నడూ లేని విధంగా అంగరంగ వైభవంగా జరగనుంది. ములుగు జిల్లా తడ్వాయి మండలం మేడారంలో నిర్వహించే ఈ మహా జాతరను మరింత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే జాతరకు ముందే భక్తులు పెద్ద సంఖ్యలో మేడారానికి చేరుకుని వన దేవతలను దర్శించుకుంటున్నారు. ఈసారి మహా జాతరకు కోటికి పైగా భక్తులు తరలిరానున్నారని అంచనా వేస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం రూ.251 కోట్లతో మేడారంలో విస్తృత అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ప్రతిసారి తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితమయ్యే పరిస్థితి నుంచి బయటపడి, శాశ్వత నిర్మాణాలపై ఈసారి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. రోడ్లు, సౌకర్యాలు, వసతులతో పాటు పలు మౌలిక సదుపాయాల పనులు తుది దశకు చేరుకున్నాయి. మేడారం మహా జాతర నేపథ్యంలో చేపట్టిన సుందరీకరణ పనులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7 కోట్లకు పైగా నిధులతో మేడారంలోని పలు కూడళ్లను కొత్త హంగులతో తీర్చిదిద్దింది. ప్రధాన జంక్షన్ల వద్ద ఏర్పాటు చేసిన శిల్పాలు, స్వాగత తోరణాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆసియా ఖండంలోని అతిపెద్ద గిరిజన మహా జాతరగా పేరొందిన ఈ ఉత్సవానికి తగిన విధంగా మేడారం పరిసరాలు కళకళలాడుతున్నాయి. జాతర కోసం చేపట్టిన ఈ సుందరీకరణలో గిరిజనుల జీవనశైలి, సాంస్కృతిక సంప్రదాయాలు స్పష్టంగా ప్రతిబింబించేలా శిల్పాలను ఏర్పాటు చేశారు. ఇవి కేవలం అలంకరణ కోసమే కాకుండా, గిరిజన చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేసేలా రూపొందించారు. మేడారం చేరే మార్గాల్లోని తడ్వాయి, పస్రా, జంపన్నవాగు, ఆలయ ముందు వంటి ప్రధాన జంక్షన్లు సరికొత్త అందాలతో దర్శనమిస్తున్నాయి. మేడారం వెళ్లే మార్గంలో తడ్వాయి వద్ద



ఏర్పాటు చేసిన స్వాగత తోరణం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. కోయ గిరిజనుల డోలు వాయిద్యాలు, నృత్య భంగిమలు, విల్లు బాణం పట్టుకొని గురి చూస్తున్న గిరిజన యోధుల బొమ్మలు అక్కడి వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మారుస్తున్నాయి. అలాగే జంపన్నవాగు వైపు వెళ్లే దారిలోని జంక్షన్ల వద్ద ఎద్దులబండి, కొమ్ములు, వన్యప్రాణులు, అడవి సంపదతో పాటు సమ్మక్క--సారలమ్మ చరిత్రను ప్రతిబింబించే శిల్పాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. గిరిజనుల జీవనాధారమైన ఇప్పపువ్వు చెట్టును కూడా ప్రతీకాత్మకంగా ఏర్పాటు చేయడం ప్రత్యేకతగా నిలిచింది. ఈ జంక్షన్లు ఇప్పుడు కనువిందు చేసేలా మారడంతో మేడారానికి వచ్చిన భక్తులు వాటి వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ ఆనందంగా గడుపుతున్నారు. మేడారం చేరకముందే భక్తుల్లో ఉత్సాహం నింపేలా ఈ ఏర్పాట్లు ఉన్నాయని పలువురు చెబుతున్నారు.

### మహాజాతర ముఖ్యమైన తేదీలు

జనవరి 14 - గుడిమెలిగే పండుగ

జనవరి 21 - మండమెలిగే పండుగ

జనవరి 27 - మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి పగిడిద్దరాజు మేడారానికి పయనం. ఇదే రోజు తాడ్వాయి మండలంలో కన్నెపల్లి నుంచి జంపన్న బయలుదేరి మేడారం గద్దెకు చేరుకుంటారు

జనవరి 28 - కన్నెపల్లి నుంచి సారలమ్మ దేవత, ఏటూరునాగారం మండలంలో గల కొండాయి నుంచి గోవిందరాజులు, మహబూబాబాద్ జిల్లా నుంచి బయలుదేరిన పగిడిద్దరాజులు గద్దెకు చేరుకుంటారు

జనవరి 29 - వనదేవత సమ్మక్క చిలుకలగుట్ట నుంచి బయలుదేరి గద్దెపైకి చేరుకుంటారు

జనవరి 30 - భక్తులు ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లిస్తారు

జనవరి 31 - దేవతల వన ప్రవేశం

ఫిబ్రవరి 4 - తిరుగువారం పండుగ, మహా జాతర ఉత్సవాల ముగింపు ఉంటుంది.

# మేడారంకు 3,495 ప్రత్యేక బస్సులు

ములుగు, జనవరి 13 (ఈవార్తలు): మేడారం సమ్మక్క – సారలమ్మ జాతర ఈ నెల 28 నుంచి 31 వరకు జరగనున్న సంగతి తెలిసిందే. ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే మేడారం మహా జాతరకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాటు చేపట్టింది. మేడారంలో ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి పనులు కూడా చివర దశకు చేరుకున్నారు. అయితే మేడారం జాతరకు తెలంగాణ నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తారనే సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మేడారం మహా జాతర –2026కు భక్తులకు తరలించడం, తిరిగి వారిని స్వస్థలాలకు చేర్చడం కోసం స్పెషల్ బస్సులను నడపాలని తెలంగాణ ఆర్టీసీ నిర్ణయించింది. ఈ ఏడాది జరగనున్న మేడారం మహా జాతరకు 3,495 ప్రత్యేక బస్సులను నడపనున్నట్టుగా టీజీఎస్ఆర్టీసీ తెలిపింది. అవసరమైతే మరిన్ని బస్సులు నడిపేందుకు సిద్దంగా ఉన్నట్టుగా పేర్కొంది. అయితే ఈ బస్సుల్లో 50శాతం అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్టు వెల్లడించింది. 2003లో జారీ చేసిన జీవో నెం. 16 ప్రకారం... అదనపు ఇంధనం, నిర్వహణ ఖర్చులను భరించడానికి పండుగలు, ప్రత్యేక సందర్భాలలో నడిపే ప్రత్యేక బస్సులకు టిక్కెట్ ఛార్జీలను 1.5 రెట్లు వరకు సవరించడానికి సంస్థకు అనుమతి ఉందని కూడా టీజీఎస్ఆర్టీసీ పేర్కొంది. అయితే ఈ స్పెషల్ బస్సుల్లో (ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్) కూడా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని టీజీఎస్ఆర్టీసీ స్పష్టం చేసింది. ఇక, ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలలోని బస్టాండ్‌లతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మేడారంకు టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఇక, మేడారంలో కూడా ఆర్టీసీ బస్సుల పార్కింగ్ కోసం భారీగా



ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే తాత్కాలిక బస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కౌంటర్లు, క్యూ లైన్లు ఏర్పాటు చేయనున్నారు. అక్కడ ఏర్పాటు చేసే సూచిక బోర్డుల ఆధారంగా భక్తులు..తాము వెళ్లే ప్రాంతానికి సంబంధించిన క్యూ లైన్లలోకి వెళితే.. అక్కడ బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. ఇందుకోసం పెద్ద ఎత్తున ఆర్టీసీ సిబ్బందిని అక్కడ మోహరించనున్నారు. అలాగే కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేయనున్నారు. వారికోసం తాత్కాలిక విశ్రాంతి కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. వారికి తాగునీరు, భోజన వసతి కోసం కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మేడారం జాతర నేపథ్యంలో ఆర్టీసీ సిబ్బందికి, ప్రత్యేకంగా డ్రైవర్లకు సూచనలు చేయనున్నారు.



## ధాన్యం కొనుగోళ్లలో మాది రికార్డు

**ఖరీఫ్‌లో 70.82 లక్షల టన్నులు కొనుగోలు**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చారిత్రక మైలురాయిని అధిగమించిందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 2025–26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రికార్డు సృష్టించిందని తెలిపారు. గతంలో కొనుగోలు చేసిన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల రికార్డును ఈ ఖరీఫ్ సీజన్‌లో అధిగమించినట్లు వెల్లడించారు. పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పాటు రాష్ట్ర రైతుల భాగస్వామ్యంతోనే ఈ రికార్డు సాధ్యమైందని మంత్రి స్పష్టం చేశారు. ధాన్య సంపదకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ జరుపుకుంటున్న రైతులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన 70.82 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 32.45 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దొడ్డు రకం కాగా, 38.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్న రకాలని మంత్రి వెల్లడించారు. తెలంగాణలో సాధించిన ఈ దిగుబడికి రాష్ట్రవ్యాప్తంగా 13.97 లక్షల మంది రైతులకు మద్దతు ధర అందించామని ఆయన అన్నారు.



## ప్రభాస్ సినిమాపై రేవంత్ కక్ష: దాసోజు

హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తాజా చిత్రం 'ది రాజాసాబ్'ను ఉద్దేశిస్తూ రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ప్రభాస్ పెద్దమ్మ కలిసినప్పుడు... కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ వస్తుందని కేటీఆర్ తో చెప్పారని... దీంతో కక్షగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం 'ది రాజాసాబ్' సినిమా టికెట్ రేట్లు పెంచుకోవడానికి లేకుండా చేశారని ఆరోపించారు. ఇది పూర్తిగా కక్షపూరిత చర్యల్లో భాగమేనని... జీవో ఇచ్చినట్టే ఇచ్చి, హైకోర్టు స్టే వచ్చేట్టు మేనేజ్ చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఒక్కో హీరోకు ఒక్కో న్యాయమా? ఒక సినిమాను తిరస్కరించి, మరో సినిమాకు అనుమతి ఇవ్వడం వెనుక ఉద్దేశం ఏమిటి? సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి ప్రమేయం లేకుండానే సీఎం సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు" అంటూ హరీశ్ రావు మాట్లాడిన మాటలు నిజమే కదా? అని శ్రవణ్ ప్రశ్నించారు. ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు మాటల దాడులు చేయడం దుర్మార్గమని విమర్శించారు. సీఎం తన ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకుంటున్నారని... ఏమాత్రం ఆత్మగౌరవం ఉన్నా కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## మద్దతిస్తే మాకింత బలం!

**సపోర్ట్ ఇస్తే స్వాగతిస్తాం.. రాంచందర్ రావు**

హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. తమ పార్టీకి ఎవరైనా మద్దతు తెలిపితే స్వాగతిస్తామని ఆయన పేర్కొన్నారు. జనసేన ఒక రాజకీయ పార్టీ అని, ఆ పార్టీ తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తే ఎలాంటి అభ్యంతరం ఉండదని ఆయన అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీ ఎదుగుదలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేయడానికి గులాబీ పార్టీకి అభ్యర్థులే కరవయ్యారని ఎద్దేవా చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమ పార్టీ మంచి ఫలితాలు సాధించిందని ఆయన గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ తమ సత్తా చాటుతామని రామచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. ఎంపీలు వారి నివాసాల్లో సమావేశం కావడంలో తప్పులేదని ఆయన అన్నారు. తనకు వ్యతిరేకంగా ఎవరైనా సమావేశం అయ్యారనే విషయంపై తనకు సమాచారం లేదని ఆయన తెలిపారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పార్టీ పెడతారో లేదో తనకు తెలియదని ఆయన స్పష్టం చేశారు.

# కవితను కాంగ్రెస్‌లో చేర్చుకోం: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారంపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ, ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరుతారన్న ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ దోపిడీకి కవిత వ్యాఖ్యలే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. కవిత వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి జరిగిందని స్వయంగా కవితనే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గతంలో జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని విమర్శించారు. ఒక నియోజకవర్గం మూడు నాలుగు జిల్లాల్లో ఉందని, కేసీఆర్ తన కొడుకు కోసం, అల్లుడి కోసం, కూతురు కోసం ఒక్కో జిల్లా చేశారని ఆరోపించారు. బీజేపీ గతమేనని, దానికి భవిష్యత్తు లేదని జోస్యం మహేశ్ కుమార్ గౌడ్ చెప్పారు.



బీఆర్ఎస్‌కు చరిత్రే మిగులుతుందని అన్నారు. దేవుడి పేరు ప్రస్తావించకుండా బీజేపీ రాజకీయం చేయదని విమర్శించారు. అసలైన హిందువులు కాంగ్రెస్ నాయకులేనని అన్నారు. తాము ఇంట్లో పూజిస్తామని, బయటకు వచ్చాక అన్ని మతాలను గౌరవిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ నేతల దోపిడీపై ప్రశ్నిస్తే రాజకీయ ఆరోపణలు అంటారని, మరి కవిత ఆరోపణల సంగతి ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని ఆయన స్పష్టం చేశారు. మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని అన్నారు. మేడారంలో మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని అభిప్రాయపడ్డారు. సినిమాల టిక్కెట్ ధరలను ఎంత పెంచకూడదని ప్రయత్నించినప్పటికీ, పరిశ్రమను ప్రోత్సహించేందుకు తప్పడం లేదని అన్నారు. పార్టీలో ఒకరికి రెండు నామినేటెడ్ పదవులు ఇవ్వవద్దని నిర్ణయించినట్లు చెప్పారు. ఐఏఎస్ అధికారులపై వచ్చిన ఆరోపణలు సరికాదని అన్నారు. ఇష్టారీతిన వార్తలు రాస్తే ఎలాగని ప్రశ్నించారు. మీడియాలో జరిగిన అసత్య కథనాలపై సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని ఆయన పేర్కొన్నారు.

# మీడియాపై సిట్ సరే.. మీ స్కాంల సంగతేంది?

**తీవ్రస్థాయిలో స్పందించిన కేటీఆర్**

**పాలన వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకే ఎత్తుగడలని విమర్శ**

హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పాలనాపరమైన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే ప్రభుత్వం తరచూ కమిషన్‌లు, ప్రత్యేక దర్యాప్తు బృందాల (సిట్) పేరుతో 'అటెన్షన్ డైవర్షన్ డ్రామాలు' ఆడుతోందని ఆయన ధ్వజమెత్తారు. ఒక మంత్రికి సంబంధించిన వార్తను ఉటంకించినందుకు మీడియా సంస్థలపై సిట్ వేయడాన్ని తప్పుబట్టిన కేటీఆర్, సొంత పార్టీ నేతలు చేసిన తీవ్రమైన ఆరోపణలపై మాత్రం ఎందుకు విచారణ జరపడం లేదని సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగాయని చెబుతున్న పలు ఘటనలను కేటీఆర్ తన ప్రకటనలో ఏకరవు పెట్టారు. "ఒక మంత్రి పీఏ, రేవంత్ సహచరుడు



కలిసి పారిశ్రామికవేత్త తలకు తుపాకి పెట్టి రూ.300 కోట్లు డిమాండ్ చేస్తే దానిపై సిట్ లేదు. ములుగు జిల్లాలో మంత్రి పీఏ ఇసుక దందాలో కోట్లు దండుకుంటే చర్యలు లేవు. రెవెన్యూ మంత్రి కుమారుడు వందల కోట్ల భూకబ్జాకు పాల్పడితే, కేసు పెట్టిన పోలీస్ అధికారి బదిలీ అయ్యారు కానీ, కబ్జాపై విచారణ లేదు" అని కేటీఆర్ ఆరోపించారు. అంతేకాకుండా, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ఓ కాంట్రాక్టర్‌ను రూ.8 కోట్ల కోసం బెదిరించారని, కస్తూర్బా గాంధీ పాఠశాలల బంకర్ బెడ్స్ కొనుగోలులో రూ.100 కోట్ల కుంభకోణం జరిగిందని, లిక్కర్ హోలోగ్రామ్ టెండర్ వివాదం, చీప్ లిక్కర్ కంపెనీలకు అక్రమ అనుమతులు వంటి అనేక స్కామ్‌లపై ప్రభుత్వం ఎందుకు సిట్ వేయలేదని ఆయన నిలదీశారు. యూనివర్సిటీ భూముల అమ్మకంలో భారీ మోసం జరిగిందని సుప్రీంకోర్టు కమిటీయే తేల్చినా విచారణ జరపకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. "అధికార పక్షానికి సన్నిహితంగా ఉండే ఓ టీవీ ఛానెల్ వేసిన వార్తను కేవలం ఉటంకించినందుకు అనేక ఛానెళ్లపై, డిజిటల్ మీడియాపై సిట్ ఏర్పాటు చేశారు. అసలు వార్త వేసిన వారిని వదిలేసి, ఈ కొత్త డ్రామా ఎవరిని కాపాడటానికి? ఎవరిని వేటాడటానికి?" అని కేటీఆర్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రశ్నించే మీడియా గొంతుకలపై వేధింపులు ఆపకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.



## అన్వేష్‌పై కరాటే కల్యాణి మరోసారి ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): 'నా అన్వేషణ' యూట్యూబర్ అన్వేష్‌పై ప్రముఖ సినీ నటి కరాటే కల్యాణి మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భారత పాస్‌పోర్టును దరిద్రపు పాస్‌పోర్టు అని అన్వేష్ వ్యాఖ్యానించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాలకు వెళ్లే భారతీయులకు పాస్‌పోర్టు ఎంతో ముఖ్యమని ఆమె అన్నారు. పాస్‌పోర్టు గురించి పోలీస్ వెరిఫికేషన్ కూడా జరుగుతుందని, దీనికి ఎంతో విలువ ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. అతడి పాస్ పోర్టును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. పాస్‌పోర్టుపై రాజముద్ర ఉంటుందని, అలాంటి పాస్‌పోర్టును ఎంతో జాగ్రత్తగా చూసుకుంటామని ఆమె అన్నారు. మనం ఎంతో జాగ్రత్తగా చూసుకునే పాస్‌పోర్టును అన్వేష్ దూషిస్తున్నాడని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు గంటలు వెరిఫికేషన్ కోసం నిరీక్షించేలా చేశారని అన్వేష్ చెబుతున్నాడని, కానీ అతని ప్రవర్తన చూసి వెయిట్ చేయించారని ఆమె విమర్శించారు. అన్వేష్ పాస్‌పోర్టు రద్దయ్యేంత వరకు తాము పోరాడతామని ఆమె అన్నారు. అన్వేష్ భారత్‌లో అడుగుపెట్టిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఒవైసీవి విభజన రాజకీయాలు

**హిందువుల వల్లే ప్రజాస్వామ్యం.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై సీనియర్ బీజేపీ నేత, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. ఒవైసీ మాటల వెనుక దేశ విభజన రాజకీయాలు ఉన్నాయని ఆయన విమర్శించారు. అవి మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టేలా ఉన్నాయని ఆరోపించారు. హిజాబ్ ధరించే ముస్లిం మహిళ దేశానికి ప్రధాని కావాలన్న అసదుద్దీన్ ఒవైసీ ఆకాంక్ష వెనుక దేశ విభజన రాజకీయాలు దాగి ఉన్నాయని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఓ హిందువు ప్రధాని కావాలని పాకిస్థాన్, బంగ్లాదేశ్ వెళ్లి డిమాండ్ చేయగలరా? అంటూ ఒవైసీకి సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిన్న నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత్‌లో హిందువులు మెజారిటీగా ఉన్నారు కాబట్టే



ఇక్కడ ప్రజాస్వామ్యం కొనసాగుతోందన్నారు. లేదంటే పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల్లోని హిందువులకు ఎదురైన పరిస్థితులే ఇక్కడి హిందువులకు ఎదురయ్యేవని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో మతాల పేరుతో రాజకీయాలకు తావు ఉండదని స్పష్టం చేశారు. పాతబస్తీలో దళితులు, గిరిజన బస్తీలు, చెరువులను కబ్జా చేసిన చరిత్ర మజ్లిస్ పార్టీదేనని కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఇదే సమయంలో ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై వస్తున్న విమర్శలపైనా ఆయన వివరణ ఇచ్చారు. పని కావాలని నమోదు చేసుకున్న కూలీలకు 15 రోజుల్లో ఉపాధి కల్పించకపోతే నిరుద్యోగ భృతి చెల్లించేలా వీబీ – జీరాం చట్టంలో నిబంధనలు ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ రంగానికి అనుసంధానంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు చెప్పారు. ఒక పథకానికి పేరు మార్పు ముఖ్యం కాదని, ఆ పథకం ద్వారా పేదలకు వాస్తవంగా లబ్ధి కలుగుతుందా లేదా అన్నదే ముఖ్యమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## జీ రామ్ జీతో 200 రోజుల ఉపాధి

**కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడి**



కరీంనగర్, జనవరి 13 (ఈవార్తలు): 'వీబీ జీరామ్ జీ' పథకం ద్వారా ఉపాధి కార్మికులకు సంవత్సరానికి 200 రోజుల పని దినాలు లభిస్తాయని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఉపాధి హామీ పథకం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ'ని ప్రవేశపెట్టడంపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో ఆయన మరోసారి స్పందించారు. ఈ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీల ఆదాయం రెట్టింపు అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం ఉండదని ఆయన స్పష్టం చేశారు. గతంలో కంటే ఈ పథకానికి అదనంగా రూ.17 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకం అమలుకు అదనంగా రూ.340 కోట్లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. రైతులకు న్యాయం చేకూరే విధంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ సీజన్‌లో ఈ పథకం పనులు జరగవని, దీనివల్ల కూలీలు అందుబాటులో ఉంటారని ఆయన అన్నారు.



## కేటీఆర్‌కు కొలంబియా బిజినెస్ స్కూల్ ఆహ్వానం

హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బీఆర్ఎస్ హయాంలో మంత్రిగా ఆయన చేసిన అసాధారణ కృషిని, తెలంగాణను ప్రపంచపటంలో సమున్నత స్థాయిలో నిలిపిన తీరును గుర్తిస్తూ.. అంతర్జాతీయ వేదికలపై ఆయన ఆలోచనలను పంచుకోవాల్సిందిగా ఆహ్వానం అందింది. సాంకేతికత, పాలన, సుస్థిర అభివృద్ధి, పట్టణ అభివృద్ధి, ఆర్థిక వృద్ధిపై ఆయనకు ఉన్న లోతైన అవగాహన ప్రపంచవ్యాప్తంగా విద్యా, విధాన నిర్ణేత, వ్యాపార వేదికలపై బలమైన ముద్ర వేసింది. ఈ క్రమంలో న్యూయార్క్ నగరంలోని కొలంబియా బిజినెస్ స్కూల్‌లో 2026 ఏప్రిల్ 4న జరగనున్న '21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్' లో ప్రసంగించాలని కేటీఆర్‌కు ఆహ్వానం అందించింది.

# పంచాయతీలకు 277 కోట్లు

**విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు రూ.277 కోట్ల నిధులను విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులతో జరిపిన సమావేశం అనంతరం ఈ నిధుల విడుదల జరిగింది. కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీల ఖర్చులను తీర్చడానికి నిధులను విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. దానికి అనుగుణంగా నిధులు విడుదలయ్యాయి. ఈ శుభవార్తను గ్రామాలకు తెలియజేస్తూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. నూతన సర్పంచ్‌అబక్ష్రీలు, వార్డు సభ్యులు ప్రమాణ స్వీకారం చేసేశారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో నూతన సర్పంచులు ఉత్సాహంగా పనులు మొదలుపెట్టారు. అలాంటి సమయంలో ప్రభుత్వం నుంచి కొత్తగా రూ.277 కోట్ల నిధులు విడుదల అయ్యాయి. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు, వార్డు సభ్యులు బాధ్యతలు తీసుకున్న తర్వాత ఈ నిధులు విడుదల కావడం గ్రామ పాలనకు మంచి ఆరంభాన్ని ఇస్తుందని ప్రభుత్వం అనుకుంటోంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులు, వీధి దీపాలు, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కీలక పనులు చేసేందుకు పంచాయతీలకు అవకాశం లభిస్తుంది. ప్రజలకు ఉపయోగపడే పనులపై నిధులు ఖర్చుకా



నున్నాయి. గ్రామాల అభివృద్ధి ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి గ్రామాల నుంచే ప్రారంభమనుతుందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడం ద్వారానే.. సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు.



జగిత్యాల జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ముగ్గుల పోటీల్లో..



జగిత్యాల ఎస్పీ కార్యాలయంలో జరిగిన సంక్రాంతి సంబురాల్లో..

## స్కూల్ గేమ్స్‌లో జోషితా మెరుపులు



హైదరాబాద్, జనవరి 13 (ఈవార్తలు): రాంచీలో జరిగిన 69వ జాతీయ పాఠశాల క్రీడలు (అండర్-17)లో హైదరాబాద్‌కు చెందిన జోషితా వీరవల్లి కాంపౌండ్ ఆర్చరీ ఒలింపిక్ రౌండ్‌లో స్వర్ణం, క్వాలిఫికేషన్ రౌండ్‌లో రజతం సాధించింది. సీబీఎస్ఈ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మహర్షి విద్యా మందిర్ (కొండాపూర్) పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఈ 15 ఏళ్ల విద్యార్థిని, ఒలింపిక్ రౌండ్ (ఎలిమినేషన్) విభాగంలో 150 పాయింట్లకు గాను 142 పాయింట్లు సాధించి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిష్ఠ గుప్తా (141) మరియు గుజరాత్‌కు చెందిన చేతనా శంకర (139) కంటే ముందు నిలిచింది. వ్యక్తిగత క్వాలిఫికేషన్ రౌండ్‌లో జోషితా 691 పాయింట్లు సాధించి, నిష్ఠ (692) కంటే వెనుకబడి, చేతన (683) కంటే ముందు నిలిచింది. జోషితా కొంపల్లిలోని అరుణ్ ఆర్చరీ అకాడమీలో అంతర్జాతీయ ఆర్చర్ మరియు రిఫరీ అరుణ్ కుమార్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతోంది.

## సీబీఐ దర్యాప్తు ఇద్దరికేనా?

**సుప్రీంను ఆశ్రయించిన సునీతారెడ్డి**

**వివేకా కేసులో కీలక పరిణామం**



విజయవాడ, జనవరి 13 (ఈవార్తలు): ఏపీ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) తదుపరి దర్యాప్తు పరిధిని కేవలం ఇద్దరు వ్యక్తులకు మాత్రమే పరిమితం చేస్తూ హైదరాబాద్ సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వివేకా కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతారెడ్డి సుప్రీంకోర్టులో కొత్తగా పిటిషన్ దాఖలు చేశారు. ట్రయల్ కోర్టు నిర్ణయం, తాము లేవనెత్తిన అంశాలకు, సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని సునీత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరంపై మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని గతంలో సుప్రీంకోర్టు ట్రయల్ కోర్టును ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాల మేరకు విచారణ జరిపిన సీబీఐ కోర్టు, ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన అంశాలపై మాత్రమే దర్యాప్తును పరిమితం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పాక్షిక ఉత్తర్వులనే సునీతారెడ్డి తాజాగా సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి సోదరుడైన వివేకానందరెడ్డి, 2019 మార్చి 15న కడప జిల్లా పులివెందులలోని తన నివాసంలో దారుణహత్యకు గురయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో దర్యాప్తు, విచారణ నిష్పక్షపాతంగా జరగడం లేదని ఆందోళనలు వ్యక్తమవడంతో, ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేసింది. ఈ కేసులో కడప ఎంపీ వై.ఎస్. అవినాష్ రెడ్డి సహా పలువురిని నిందితులుగా చేర్చి సీబీఐ ఛార్జిషీట్లు దాఖలు చేసింది. సాక్షులను ప్రభావితం చేయడం, సాక్ష్యాధారాలను తారుమారు చేయడం వంటి అంశాలపై మరింత లోతుగా దర్యాప్తు జరపాలని సునీత మొదటి నుంచి న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. సునీత దాఖలు చేసిన ఈ తాజా పిటిషన్‌ను, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్లతో కలిపి విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. ఈ పరిణామంతో ఆరేళ్లుగా కొనసాగుతున్న ఈ కేసులో దర్యాప్తు భవిష్యత్తు ఎలా ఉండబోతోందనే అంశంపై సుప్రీంకోర్టు తీర్పు కీలకం కానుంది.

## భారత జీడీపీ అంచనా 6.5 శాతం: వరల్డ్ బ్యాంక్

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత వృద్ధి అంచనాలను అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. గతేడాది అక్టోబర్‌లో అంచనా వేసిన 6.3 శాతంగా అంచనా వేసింది. ప్రస్తుతం దీన్ని 6.5 శాతానికి సవరిస్తున్నట్టు ప్రపంచ బ్యాంకు మంగళవారం ప్రకటనలో తెలిపింది. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థికవ్యవస్థలలో భారత్ అత్యంత వేగవంతమైన వృద్ధి రేటును కొనసాగిస్తుంది. అమెరికాకు పంపే కొన్ని ఎగుమతులపై అధిక సుంకాలు ఉన్నప్పటికీ, ఇది భారత వస్తువుల ఎగుమతుల్లో దాదాపు 12 శాతం వాటాయే ఉంది. ప్రధానంగా దేశీయ డిమాండ్‌లో బలమైన ఊపు, గతంలో ఊహించిన దానికంటే అధిక స్థిరమైన ఎగుమతుల ద్వారా ప్రతికూల ప్రభావాలను భారత్ అధిగమిస్తుందని ప్రపంచ బ్యాంకు తన తాజా గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్ నివేదికలో పేర్కొంది. ఇదే సమయంలో ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గితే భారత వృద్ధి అంచనా మరింత మెరుగుపడుతుందని ప్రపంచ బ్యాంకు చెబుతోంది. కొన్ని వాణిజ్య సమస్యలకు పరిష్కారం లభించడం, అమెరికా సుంకాలను పాక్షికంగా ఉపసంహరించుకుంటే, భారత ఎగుమతులు ఊహించిన దానికంటే వేగంగా పెరగవచ్చు. వాణిజ్య అడ్డంకులను తగ్గించడానికి దేశాల మధ్య చర్చలు మరింత విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో కూడా సహాయపడతాయి. తద్వారా వ్యాపార, వినియోగదారుల విశ్వాసం పెరుగుతుంది, దీనివల్ల ఆర్థిక వ్యవస్థలో అధిక వ్యయం, అధిక పెట్టుబడులకు ఆస్కారం ఉంటుందని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది.

## అమరావతి హైకోర్టు నిర్మాణంలో రికార్డు

**48 గంటల్లోనే భారీ కాంక్రీట్ పనుల పూర్తి**



అమరావతి, జనవరి 13 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో హైకోర్టు శాశ్వత భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నిర్ణీత లక్ష్యాలను అధిగమిస్తూ సీఆర్డీఏ యంత్రాంగం రికార్డు స్థాయిలో పనులను పూర్తి చేస్తోంది. ఇందులో భాగంగా హైకోర్టు భవన నిర్మాణానికి సంబంధించి కేవలం 48 గంటల వ్యవధిలోనే 3,026 క్యూబిక్ మీటర్ల భారీ కాంక్రీట్ నింపే ప్రక్రియను విజయవంతంగా ముగించింది. ఈ నెల 10వ తేదీ రాత్రి ప్రారంభమైన ఈ భారీ కాంక్రీట్ పనులు, సోమవారం రాత్రికి పూర్తయ్యాయి. వందలాది మంది కార్మికులు షిఫ్టుల వారీగా, ఎక్కడా విరామం లేకుండా పని చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకున్నారు. సీఆర్డీఏ కమిషనర్ కె.కన్నబాబు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, అధికారులకు, కార్మికులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందించారు. గతంలో నిలిచిపోయిన ఈ పనులను ఐఐటీ నిపుణుల ధ్రువీకరణ పొందిన తర్వాతే సీఆర్డీఏ గతేడాది తిరిగి ప్రారంభించింది. గత ప్రభుత్వ హయాంలో పనులు ఆగిపోవడంతో పునాదుల్లో చేరిన నీటిని పూర్తిగా తొలగించి, పటిష్ఠమైన చర్యలు తీసుకున్న తర్వాతే పనులను వేగవంతం చేశారు. నేలపాడు సమీపంలో ఈ శాశ్వత హైకోర్టు భవనాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. సుమారు 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో బేస్‌మెంట్‌తో పాటు గ్రౌండ్ ప్లస్ 7 అంతస్తుల నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఈ భవనంలో మొత్తం 52 కోర్టు హాళ్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. 2027 మార్చి నాటికి భవనాన్ని సిద్ధం చేయాలనే పట్టుదలతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.





జగిత్యాల జిల్లా మల్యాల మండలం బల్వంతాపూర్‌లో మహిళలకు ఇందిరమ్మ చీరలను అందజేస్తున్న గ్రామ సర్పంచ్ తైదల కరుణ, ఉపసర్పంచ్ జంగిలి శ్రీశైలం. చిత్రంలో మహిళా సంఘం అధ్యక్షురాలు పెద్దిరెడ్డి సుజాత, వీవోఏ బొమ్మకంటి శ్యామల, ఆశావర్కర్ దొమ్మాటి సుమలత, వార్డు మెంబర్లు తదితరులు

## ఊరు ఊరంతా బూడిద

### కాకినాడ జిల్లా సార్లంకపల్లెలో దారుణం.. 38 పూరిళ్లు దగ్ధం




కాకినాడ, జనవరి 13 (ఈవార్తలు): సంక్రాంతి వేళ తీవ్ర విషాదం నెలకొంది. ఏపీలోని కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సార్లంకపల్లెలో ఊరుఊరంతా భస్మమైంది. ఈ తండాలోని మూడు పక్కా ఇళ్లు మినహా 38 పూరిళ్లు కాలి బూడిదయ్యాయి. దీంతో 120 మంది గ్రామస్తులు కట్టుబట్టలతో మిగిలిపోయారు. సంక్రాంతి పండుగ దగ్గరకు వస్తుండటంతో సరుకులు కొనుగోళ్ల కోసం సోమవారం సాయంత్రం గ్రామస్తులంతా తుని పట్టణానికి వెళ్లారు. ఇంతలోనే గుడిసెల్లో మంటలు చెలరేగాయి. అన్ని తాటాకుతో నిర్మించిన పూరిళ్లు కావడంతో ఒక ఇంటికి అంటుకున్న మంట.. మరో ఇంటికి దావానలం వ్యాపించింది. అగ్ని ప్రమాదం గురించి తెలియగానే తునికి వెళ్లిన గ్రామస్తులంతా హడావుడిగా బయల్దేరి తండాకు వచ్చారు. కానీ అప్పటికే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది. అన్ని గుడిసెలకు మంటలు అంటుకుని ఎగిసిపడుతుండటంతో మంటలను ఆర్పడం కాదు కదా.. దగ్గరకు వెళ్లే పరిస్థితి కూడా లేకుండా పోయింది. కళ్ల ముందే ఊరు ఊరంతా భస్మం కావడంతో గ్రామస్తులంతా నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు.

**బాధితులకు అండగా ఉండాలి: చంద్రబాబు**

అగ్నిప్రమాద బాధితులకు అన్ని విధాలుగా ఉండాలని అధికారులను ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి కొత్త ఇల్లు మంజూరు చేయాలన్నారు. కాగా, తక్షణసాయంగా ఒక్కో కుటుంబానికి రూ.25వేలు నగదు అందజేస్తున్నామని అధికారులు తెలిపారు. సంక్రాంతి పండుగ వేళ సార్లంకపల్లెలో జరిగిన అగ్నిప్రమాదంపై మంగళవారం నాడు మంత్రులు, అధికారులతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పండుగ సమయంలో ఈ అగ్నిప్రమాదం పెను విషాదాన్ని తెచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమీక్ష సందర్భంగా బాధిత కుటుంబాలకు అందిస్తున్న సాయాన్ని హోంమంత్రి అనిత, ఇతర అధికారులు చంద్రబాబుకు వివరించారు. తక్షణ సాయం కింద ఒక్కో కుటుంబానికి రూ.25వేల గనదు అందజేస్తున్నామని తెలిపారు. ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి కొత్త ఇల్లు మంజూరు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. అప్పటివరకు వారికి అవసరమైన వసతి, ఇతరసాయం అందజేయాలని సూచించారు. ప్రమాదంలో కాలిపోయిన డాక్యుమెంట్లు, ఆధార్ కార్డులు ఇచ్చేందుకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు అందే సాయంపై మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని సూచించారు.





**ఏపీ మాజీ సీఎం జగన్ దిగ్భ్రాంతి**

సార్లంకపల్లె అగ్ని ప్రమాదంపై వైసీపీ అధినేత జగన్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ గిరిజన గ్రామంలో 38 పూరిళ్లు దగ్ధం కావడం కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. క్షణాల్లో ఊరంతా భస్మీపటలం కావడం విచారకరమని అన్నారు. బాధితులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అండగా నిలవాలని... వారికి వసతి, ఆహారం అందించాలని సూచించారు. తక్షణ సాయంగా ఒక్కో బాధిత కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించాలని, కొత్త ఇళ్లు మంజూరు చేయాలని అన్నారు. కొత్త ఇళ్లు నిర్మించి ఇచ్చేంత వరకు వారికి అన్ని విధాలుగా అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాదం వివారాల్లోకి వెళితే... మన్యం మారుమూలన ఉండే ఈ తండాలో అగ్నిప్రమాదం సంభవించింది. నిమిషాల్లోనే ఊరంతా కాలి బూడిద అయిపోయింది. మూడు పక్కా ఇళ్లు మినహా 38 పూరిళ్లు పూర్తిగా కాలిపోయాయి. అడవి తల్లిపై ఆధారపడి జీవించే గిరిజనులు సంక్రాంతి సందర్భంగా సరుకును కొనుగోలు చేసేందుకు తుని పట్టణానికి వెళ్లారు. ఆ సమయంలోనే ఈ ఘోరం సంభవించింది. 50 కిలోమీటర్ల దూరంలోని తుని నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చేటప్పటికే ఊరంతా అగ్నికి ఆహుతి అయిపోయింది.





## ఏపీ ఉద్యోగులకు సంక్రాంతి కానుక

విజయవాడ, జనవరి 13 (ఈవార్తలు): సంక్రాంతి కానుకగా ఉద్యోగులు, పెన్షనర్లు, పోలీసులు, కాంట్రాక్టర్లకు పెద్ద ఊరటనిచ్చేలా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల డీఏ, డీఆర్ ఎరియర్స్, పెండింగ్ బిల్లులు, బకాయిల క్లియరెన్స్ కోసం రూ. 2,653 కోట్లను ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో పెద్ద భాగం డీఏ, డీఆర్ ఎరియర్స్‌కి మంజూరు చేసింది. ఒక పెండింగ్ ఇన్‌స్టాల్‌మెంట్ కోసం రూ. 1,100 కోట్లు విడుదల చేసింది. దీంతో సీపీఎస్ ఉద్యోగుల్లో 2.25 లక్షల మంది, పెన్షనర్లలో 2.70 లక్షల మంది నేరుగా లబ్ధి పొందుతారు. పోలీస్ సిబ్బందికి కూడా సరెండర్ లీవుల బకాయిల కోసం రూ. 110 కోట్లు మంజూరు చేశారు. దీనివల్ల దాదాపు 55 వేల మంది పోలీసులకు ప్రయోజనం కలగనుంది. ఇక కాంట్రాక్టర్ల విషయానికొస్తే... ఈఏపీ, నాబార్డు, సాస్కీ, సీఆర్ఐఎఫ్ వంటి ప్రాజెక్టుల కింద చేసిన పనుల బిల్లులకు రూ. 1,243 కోట్లు రిలీజ్ అయ్యాయి. అందులోనే 'నీరు-చెట్టు' పథకం బిల్లులకు సుమారు రూ. 40 కోట్లు కేటాయించారు. దీంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన 19 వేలకు పైగా కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు జరగనున్నాయి. మొత్తంగా చూస్తే దాదాపు 5.70 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, పోలీసులు, కాంట్రాక్టర్లకు ఈ సంక్రాంతి వేళ ఆర్థిక ప్రయోజనం



# స్నాక్స్ ప్యాకెట్‌లో బొమ్మ పేలి పోయిన కంటిచూపు

భోపాల్: ఒడిశాలో అత్యంత దిగ్భ్రాంతికరమైన ఘటన వెలుగుచూసింది. 5 రూపాయల స్నాక్స్ ప్యాకెట్‌లో ఉచితంగా వచ్చిన బొమ్మతో ఆడుకుంటుండగా అది పేలిపోవడంతో 8 ఏళ్ల బాలుడు ఒక కంటి చూపును కోల్పోయాడు. బలాంగీర్ జిల్లాలో ఈ విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బాధితుడైన బాలుడు స్థానిక దుకాణంలో 'లైట్ హౌస్ట అనే బ్రాండ్‌కు చెందిన కార్న్ పఫ్స్ ప్యాకెట్‌ను కొనుగోలు చేశాడు. స్నాక్స్ తిన్న తర్వాత, అందులో వచ్చిన చిన్న బొమ్మతో ఆడుకోవడం మొదలుపెట్టాడు. ఆ సమయంలోనే ఆ బొమ్మ ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోయింది. ఈ పేలుడు ప్రభావంతో బాలుడి కంటి గుడ్డు పగిలిపోయింది. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి, ఆ కంటికి చూపు తిరిగి రాదని నిర్ధారించారు. ఈ ఘటనపై బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంబంధిత స్నాక్ తయారీ సంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆ ఉత్పత్తిని మార్కెట్ నుంచి పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. తమ కుమారుడికి తక్షణమే నష్టపరిహారం అందించాలని కోరారు. పిల్లలను ఆకర్షించడానికి ఆహార ఉత్పత్తుల్లో ఉచితంగా ఇచ్చే బొమ్మలు ఎంత ప్రమాదకరమో ఈ ఘటన మరోసారి హెచ్చరించింది. ఇలాంటి ఉత్పత్తుల భద్రతపై కఠినమైన నియంత్రణలు, తనిఖీలు అవసరమని తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



# మరింత రెచ్చిపోండి!

## ఇరాన్ ఆందోళనకారులకు ట్రంప్ పిలుపు.. త్వరలోనే సహాయం అందుతుందని వ్యాఖ్య

**ఇరాన్‌తో వ్యాపారం.. 25 శాతం సుంకం హెచ్చరిక**

**అమెరికా తీరుపై రష్యా, చైనా తీవ్ర అభ్యంతరం**

టెహ్రాన్: ఇరాన్‌లో గత కొన్నేళ్లుగా ఎన్నడూ లేనంత తీవ్రస్థాయిలో జరుగుతున్న ప్రభుత్వ వ్యతిరేక నిరసనలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మద్దతు ప్రకటించారు. ఆందోళనలు కొనసాగించాలని, ప్రభుత్వ సంస్థలను స్వాధీనం చేసుకోవాలని ఇరాన్ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. "త్వరలోనే మీకు సహాయం అందుతుంది" అంటూ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్లో పోస్ట్ చేసి సంచలనం సృష్టించారు. దేశంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం, ద్రవ్యోల్బణం కారణంగా మొదలైన ఈ నిరసనలు, ప్రస్తుతం అక్కడి మతపరమైన పాలనకు పెద్ద సవాలుగా మారాయి. నిరసనకారులపై ఇరాన్ ప్రభుత్వ అణచివేతను నిరసిస్తూ, ఆ దేశ అధికారులతో తలపెట్టిన అన్ని సమావేశాలను రద్దు



చేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. నిరసనకారులపై హత్యలు ఆగే వరకు ఇరాన్ ప్రభుత్వంతో చర్చలు జరపబోనని స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఇరాన్‌తో వ్యాపారం చేసే ఏ దేశంపై అయినా 25 శాతం దిగుమతి సుంకాలు విధిస్తామని సోమవారం హెచ్చరించారు. ఇరాన్ నుంచి చైనా, భారత్, టర్కీ, యూఏఈ వంటి దేశాలు ఆయిల్ దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. అమెరికా చర్యలను రష్యా తీవ్రంగా ఖండించింది. ఇది ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని విమర్శించింది. ఇరాన్‌పై సైనిక దాడులు మధ్యప్రాచ్యానికి, ప్రపంచ భద్రతకు పెను విపత్తు అని రష్యా విదేశాంగ శాఖ హెచ్చరించింది. చైనా కూడా ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. మరోవైపు ఇరాన్‌లో ఇంటర్నెట్ షట్‌డౌన్, భారీ అరెస్టులు కొనసాగుతుండగా.. 'లాక్డ్ అండ్ లోడెడ్ (ఆయుధాలన్నీ సిద్ధం)' అంటూ సైనిక చర్యకు సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలను మరింత పెంచుతున్నాయి.

# 2000 మంది మృతి

## ఇరాన్ నిరసనల్లో వేల మంది ప్రాణార్పణం.. రాయిటర్స్‌కు ఇరాన్ ప్రభుత్వ అధికారి వెల్లడి



**ఆర్థిక సంక్షోభంతో దేశవ్యాప్తంగా ఆందోళనలు**

**అల్లర్ల వెనుక విదేశీ హస్తం ఉందని ప్రభుత్వ ఆరోపణ**

టెహ్రాన్: ఇరాన్‌లో గత రెండు వారాలుగా కొనసాగుతున్న ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. ఈ నిరసనల్లో భద్రతా సిబ్బందితో సహా దాదాపు 2,000 మంది మరణించినట్లు ఇరాన్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన రాయిటర్స్ వార్తా సంస్థకు తెలిపారు. ఇరాన్ ప్రభుత్వం ఇంత పెద్ద సంఖ్యలో మరణాలను అంగీకరించడం ఇదే మొదటిసారి. దేశంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం, అధిక ద్రవ్యోల్బణం, స్థానిక కరెన్సీ (రియాల్) విలువ పడిపోవడంతో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. డిసెంబర్ 28, 2025న టెహ్రాన్‌లోని గ్రాండ్ బజార్‌లో మొదలైన ఈ నిరసనలు, అనతికాలంలోనే దేశంలోని 31 రాష్ట్రాలకు విస్తరించాయి. ఈ మరణాలకు ఉగ్రవాదులే కారణమని, వారే ప్రజలు, భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నారని సదరు అధికారి ఆరోపించారు. అయితే, మృతుల్లో పౌరులు ఎంతమంది, భద్రతా సిబ్బంది ఎంతమంది ఉన్నారనే వివరాలు వెల్లడించలేదు. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అధికారంలోకి వచ్చిన మతపరమైన నాయకత్వానికి, గత మూడేళ్లలో ఇదే అతిపెద్ద అంతర్గత సవాలుగా మారింది. ఆర్థిక సమస్యలపై నిరసనలు చట్టబద్ధమే అని చెబుతూనే, ప్రభుత్వం కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటోంది. ఈ అల్లర్ల వెనుక అమెరికా, ఇజ్రాయెల్ హస్తం ఉందని ఇరాన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంతో సమాచార వ్యాప్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. భద్రతా బలగాలు, నిరసనకారుల మధ్య ఘర్షణలు, కాల్పుల ఘటనలకు సంబంధించిన వీడియోలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇరాన్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

**నెలలోనే రష్యాకు మూడో దెబ్బ!**

మాస్కో: ఇరాన్ సంక్షోభం, దాని మిత్రదేశమైన రష్యాకు పెద్ద దెబ్బగా మారింది. గతంలో రష్యాకు కీలక మిత్రులుగా ఉన్న సిరియా అధ్యక్షుడు బషర్ అల్-అసద్ ప్రభుత్వం 2024 డిసెంబర్‌లో కూలిపోగా, వెనిజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను 2026 జనవరి 3న అమెరికా దళాలు బంధించి తీసుకుపోయాయి.

# భారతీయ ఆతిథ్యం అద్భుతం

## ఇక్కడి ప్రజల జుట్టు సూపర్.. ఓ ఫ్రెంచ్ అమ్మాయి కితాబు

న్యూఢిల్లీ: ఉద్యోగం కోసం ఫ్రాన్స్ నుంచి భారత్‌కు వచ్చిన ఓ యువతి, ఇక్కడి జీవన విధానానికి, సంస్కృతికి ఫిదా అయింది. ఫ్రాన్స్‌తో పోలిస్తే భారత్ ఐదు విషయాల్లో ఎంతో గొప్పగా ఉందని చెబుతూ ఆమె చేసిన ఓ ఇన్‌స్టాగ్రామ్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఫ్రెల్‌డవే అనే ఈ ఫ్రెంచ్ యువతి ఫ్రాన్స్ కంటే ఇండియా మెరుగ్గా ఉన్న ఐదు అంశాలు అనే శీర్షికతో పంచుకున్న ఈ వీడియో నెటిజన్ల మనసులను గెలుచుకుంది. విదేశీయుల పట్ల భారతీయులు చూపే ఆప్యాయత, ఆతిథ్యం తనను ఎంతగానో ఆకట్టుకుందని ఆమె చెప్పింది. "ఇక్కడ నన్ను ఎంతో ప్రేమగా పలకరిస్తారు. ఫ్రాన్స్‌లో కూడా విదేశీయుల పట్ల ఇంతే దయ, ఓపెన్ హార్ట్‌తో ఉంటే బాగుండు" అని ఆమె అభిప్రాయ ౦పడింది. ఇండియాలో ఎక్కడైనా తక్కువ ధరకే రుచికరమైన, వైవిధ్యమైన వీధి ఆహారం దొరుకుతుందని ప్రశంసించింది. ఆహారం తింటూ అక్కడి వారితో మాట్లాడటం, సామాజికంగా కలవడం ఎంతో ఆనందా న్నిస్తుందని పేర్కొంది. ఇక్కడి రంగురంగుల ఆభరణాలు తనను కట్టిపడేశాయని చెప్పింది. ఝుమ్కాలు, గాజులు, నెక్లెస్‌లు వంటివి ఎంతో ఫ్యాషనబుల్‌గా, ఆకర్షణీయంగా ఉంటాయని, వాటిని చూస్తే చాలా ఇష్టమని రాసుకొచ్చింది. దేశంలో రవాణా వ్యవస్థ అద్భుతంగా ఉందని, ముఖ్యంగా స్లీపర్ ఏసీ బస్సుల సౌకర్యం గొప్పదని తెలిపింది. సమయం ఉంటే విమానాలకు బదులు స్లీపర్ బస్సుల్లో ప్రయాణిస్తే అద్భుతమైన ప్రకృతి దృశ్యాలను చూడవచ్చని సూచించింది. ఫ్రాన్స్‌లోని బస్సుల కంటే ఇక్కడి రాత్రి ప్రయాణ వ్యవస్థ మేలని పోల్చింది. చివరగా, భారతీయుల జుట్టు జన్యువులను ఆమె ప్రత్యేకంగా ప్రశంసించింది. ఇక్కడి వారు సులభంగా షాంపూ యాడ్స్‌లో అవకాశం దక్కించుకోవచ్చు... వారి జుట్టు అంత పొడవుగా, ఆరోగ్యంగా ఉంది అని సరదాగా వ్యాఖ్యానించింది.



# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

ముంబై: భారత్, అమెరికా మధ్య జరగనున్న కీలక వాణిజ్య చర్చల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడాయి. ప్రధానంగా కన్స్యూమర్ డ్యూరబుల్స్, రియల్టీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 250.48 పాయింట్లు నష్టపోయి 83,627.69 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 57.95 పాయింట్లు క్షీణించి 25,732.30 వద్ద ముగిసింది. మంగళవారం ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చలు జరగనున్నాయని భారత రాయబారి సెర్గియో గోర్ సోమవారం ప్రకటించడంతో దలాల్ స్ట్రీట్‌లో ఆచితూచి వ్యవహరించే ధోరణి నెలకొంది. దీంతో ట్రేడర్లు పెద్ద ఎత్తున కొనుగోళ్లకు దూరంగా ఉన్నారు. సెన్సెక్స్ స్టాక్స్‌లో ఎటర్నల్, టెక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభపడి సూచీలకు కొంత మద్దతు ఇచ్చాయి. అయితే, ట్రెంట్, లార్సెన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ), ఇండిగో వంటి షేర్లలో నష్టాలు మార్కెట్లను కిందకు లాగాయి. విస్తృత మార్కెట్లో మిశ్రమ ధోరణి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.20 శాతం నష్టపోగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.60 శాతం లాభంతో ముగిసింది. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 0.89 శాతం, రియల్టీ ఇండెక్స్ 0.62 శాతం నష్టపోయాయి. మరోవైపు, పీఎస్‌యూ బ్యాంకింగ్, మీడియా రంగాల షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించడంతో ఆయా సూచీలు 0.78 శాతం వరకు లాభపడ్డాయి. మార్కెట్ నిపుణుల విశ్లేషణ ప్రకారం, నిఫ్టీకి 25,650--25,600 స్థాయి వద్ద తక్షణ మద్దతు లభిస్తుందని, ఒకవేళ ఈ స్థాయిని కోల్పోతే 25,500 వరకు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలాగే, ఎగువన 25,800--25,900 వద్ద నిరోధం ఎదురవుతుందని, దీనిని దాటితేనే 26,100 స్థాయికి మార్గం సుగమం అవుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

# జననాయగన్ విడుదలకు కేంద్రం అడ్డుపుల్లు: రాహుల్

న్యూఢిల్లీ: తమిళ స్టార్ నటుడు, రాజకీయ నేత విజయ్ నటించిన 'జన నాయగన్ట సినిమా విడుదలను కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవాలని చూస్తోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చర్యలను ఆయన ఖండిస్తూ, ఇది తమిళ సంస్కృతిపై జరుగుతున్న దాడి అని అభివర్ణించారు. "జన నాయగన్ విడుదలను అడ్డుకోవాలనే ప్రయత్నం తమిళ సంస్కృతిపై దాడి చేయడమే. మోదీ గారూ, మీరు తమిళ ప్రజల గొంతును ఎప్పటికీ నొక్కలేరు" అని రాహుల్ గాంధీ 'ఎక్స్ట వేదికగా పోస్ట్ చేశారు. విజయ్ రాజకీయ ప్రవేశం తర్వాత వస్తున్న ఈ చివరి సినిమా విడుదలను మద్రాస్ హైకోర్టు నిలిపివేసిన సంగతి తెలిసిందే. సినిమాలో రాజకీయంగా సున్నితమైన 50కి పైగా సంభాషణలు, మాజీ సీఎం ఎంజీఆర్ ప్రస్తావన, రక్షణ దళాల చిత్రీకరణపై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఈ వివాదం మొదలైంది. దీంతో చిత్ర నిర్మాతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మంగళవారం నీలగిరి జిల్లా పర్యటనలో ఉన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అధికార డీఎంకేతో పొత్తుల విషయంలో విభేదాలు కొనసాగుతున్న నేపథ్యంలో, రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని విజయ్ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే)కు దగ్గరయ్యే వ్యూహంలో భాగంగానే రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తమిళనాడు పర్యటన సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు రాహుల్‌ను 'తలైవా (నాయకుడు)' అంటూ పోస్టర్లు వేయడం డీఎంకేతో సీట్ల పంపకాల చర్చల్లో తమ బలాన్ని చాటుకునే ప్రయత్నంగా కనిపిస్తోంది.

# మోదీకి ఉచితాలు ఇష్టం లేదు

**కేంద్ర మంత్రి పీయుష్ గోయల్**

రాజ్‌కోట్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఉచిత పథకాల పంపిణీ కంటే ప్రజలను వివిధ పథకాల ద్వారా సాధికారికంగా తీర్చిదిద్దడంపై విశ్వాసం కలిగి ఉన్నారని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఈ క్రమంలోనే పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాలను ప్రధాని స్వయంగా రూపొందించారని, అవి ఆయన ఆలోచనా విధానానికి ప్రతిబింబమని ఆయన పేర్కొన్నారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో నిర్వహించిన 'వైబ్రంట్ గుజరాత్ రీజినల్ కాన్ఫరెన్స్టలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రభుత్వాలు అందించే ఉచితాలపై ఆధారపడే విధానంపై ప్రధానికి నమ్మకం లేదని గోయల్ స్పష్టం చేశారు. ప్రభుత్వమే అన్నీ చేస్తుందన్న భావన తగ్గి, ప్రజలు కూడా బాధ్యత తీసుకునే విధంగా పథకాలు ఉండాలన్నదే ప్రధాని ఆలోచన అని తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ప్రధాని మోదీ పౌరులకు సాధికారత కల్పించారని ఆయన తెలిపారు. ఈ పథకం కింద సౌర ఫలకాల ఏర్పాటు కోసం వినియోగదారుడు కూడా కొంత ఖర్చును భరించాల్సి ఉంటుందని, ఇలాంటి పథకాలలో ప్రజల వ్యక్తిగత భాగస్వామ్యం ఉండాలని ఆయన చెప్పారు. ప్రభుత్వమే అన్నీ చేయాలని ప్రజలు ఆశించకూడదని, ప్రభుత్వంపై పూర్తిగా ఆధారపడకూడదని ఆయన వ్యాఖ్యానించారు. ఒక పథకం విజయవంతంగా అమలవ్వాలంటే ప్రభుత్వ మద్దతుతో పాటు పౌరుల భాగస్వామ్యం కూడా అవసరమని ఆయన అన్నారు. విద్యుత్‌ను పూర్తిగా ఉచితంగా ఇచ్చినప్పుడు భవిష్యత్తులో కోతలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# ఆరెస్సెస్‌తో సీపీసీ భేటీ

**ఢిల్లీలోని ప్రేరణ బ్లాక్‌లో సమావేశం**

**మర్యాదపూర్వక భేటీ అన్న చైనా బృందం**

న్యూఢిల్లీ: చైనా బృందం మంగళవారం ఆరెస్సెస్ ప్రతినిధులతో సమావేశమైంది. నిన్న బీజేపీ ప్రధాన కార్యాలయానికి వెళ్లిన చైనా బృందం... ఇవాళ ఢిల్లీలోని ప్రేరణ బ్లాక్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యులతో భేటీ అయింది. షక్సాగామ్ లోయపై చైనా, భారత్ మధ్య వాగ్యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జాతీయ భద్రతాంశాల్లో చైనాతో ఇలాంటి సంప్రదింపులు సరికాదని పేర్కొంది. ఆరెస్సెస్ వర్గాల ప్రకారం, చైనా ప్రతినిధి బృందం ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలేను కలిసింది. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ అని తెలిపాయి. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా (సీపీసీ) విజ్ఞప్తి మేరకు గంటసేపు సమావేశమైనట్లు వెల్లడించాయి. 'ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమే. ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ పర్యటనలో ఉన్నందున హాజరు కాలేదు. చైనా ప్రతినిధి బృందం దత్తాత్రేయ హొసబలేను కలిసింది. ఈ సమావేశానికి నిర్దిష్ట అజెండా ఏమీ లేదు' అని ఆరెస్సెస్ ప్రతినిధులు తెలిపారు. గత సంవత్సరం ఆగస్టులో ఆరెస్సెస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వివిధ దేశాల ప్రతినిధులను ఆహ్వానించారు. అయితే, పాకిస్థాన్, టర్కీ, చైనా దేశాల ప్రతినిధులను మాత్రం ఆహ్వానించలేదు.

# 19న జన నాయగన్ సెన్సార్ విచారణ

న్యూఢిల్లీ: తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన 'జన నాయగన్ట సినిమా సెన్సార్ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఈ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ జారీపై మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్ విధించిన స్టేను సవాల్ చేస్తూ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై జనవరి 19న విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమాకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ నుంచి క్లియరెన్స్ లభించలేదు. దీంతో నిర్మాతలు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, సింగిల్ జడ్జి వెంటనే సర్టిఫికెట్ జారీ చేయాలని ఆదేశించారు. అయితే, కొద్ది గంటల్లోనే సెన్సార్ బోర్డు అప్పీలు చేయడంతో డివిజన్ బెంచ్ ఆ తీర్పుపై స్టే విధించింది. ఈ నేపథ్యంలో నిర్మాతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. నిజానికి, తొలుత ఈ సినిమాను చూసిన సెన్సార్ బోర్డు ఎగ్జామినింగ్ కమిటీ, కొన్ని మార్పులతో 'యూ/ఏ 16 ప్లస్ట సర్టిఫికెట్ ఇచ్చేందుకు అంగీకరించింది. నిర్మాతలు ఆ మార్పులు చేసి సినిమాను మళ్లీ సమర్పించారు. కానీ, అదే కమిటీలోని ఒక సభ్యుడు సినిమాలోని కొన్ని సన్నివేశాలు మతపరమైన మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, రక్షణ దళాలను తప్పుగా చిత్రీకరించారని ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సీబీఎఫ్‌సీ చైర్‌పర్సన్ సినిమాను రివైజింగ్ కమిటీకి పంపడంతో విడుదల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ సినిమాపై సుమారు రూ. 500 కోట్లు పెట్టుబడి పెట్టినట్లు నిర్మాతల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరోవైపు, ఈ వివాదంలో తమ వాదనలు వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వొద్దని కోరుతూ సెన్సార్ బోర్డు సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. జనవరి 19న సుప్రీంకోర్టు విచారణ తర్వాత ఈ సినిమా భవితవ్యంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# హిందువులకు రక్షణ లేదు

**బంగ్లాదేశ్ ఈసీకి హిందూసంఘం వినతి**

ఢాకా: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో, ఆ దేశంలోని ప్రముఖ హిందూ సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఫిబ్రవరిలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో, హిందూ సంఘం బంగ్లాదేశ్ ఎన్నికల సంఘంతో సమావేశమైంది. హిందూ ఓటర్లకు ఎన్నికల సంఘం అదనపు రక్షణ కల్పించాలని ఈసీని కోరింది. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల్లో తమకు రక్షణ కరవైందని, ముఖ్యంగా మైనారిటీలపై దాడులు జరుగుతున్న ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పేర్కొంది. సురక్షితమైన ఓటింగ్ కోసం తమకు ప్రత్యేక పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసింది. బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి అక్కడి మైనారిటీ హిందువులపై దాడులు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో పలువురు హిందువులు ప్రాణాలు కోల్పోగా, మరికొంతమంది గాయపడ్డారు.

# మరోసారి విజయ్‌కు సీబీఐ నోటీసులు



చెన్నై: కరూర్ తొక్కిసలాట కేసులో ప్రముఖ సినీ నటుడు, టీవీకే పార్టీ అధినేత విజయ్‌కి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ మరోసారి నోటీసులు జారీ చేసింది. సోమవారం సీబీఐ ఆయన్ని ఆరు గంటలకు పైగా ప్రశ్నించింది. మొదటిరోజు విచారణ సమయంలోనే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని సీబీఐ పేర్కొనగా, పొంగల్ సందర్భంగా ఆయన విరామం కోరారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ తర్వాత విచారణకు రావాలని సీబీఐ రెండోసారి నోటీసులు జారీ చేసింది. జనవరి 19న విచారణకు హాజరు కావాలని సూచించింది. గత ఏడాది సెప్టెంబర్ 27న విజయ్ ప్రచార సభలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందగా, ఈ ఘటనపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు జరుపుతున్న విషయం తెలిసిందే.

# రాకెట్ ఫోర్స్.. మనకూ కావాలి!

**ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది**

న్యూఢిల్లీ: ఆధునిక యుద్ధ తంత్రంలో భాగంగా, దేశ రక్షణ కోసం ప్రత్యేకంగా ఒక రాకెట్ ఫోర్స్ కమాండ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టం చేశారు. మారుతున్న భద్రతా పరిస్థితుల్లో ఇది వ్యూహాత్మకంగా చాలా కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్మీ డే సందర్భంగా మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత యుద్ధ క్షేత్రంలో రాకెట్లు, మిసైళ్ల మధ్య వ్యత్యాసం తగ్గిపోయిందని, రెండూ నిర్ణయాత్మక ఫలితాలను ఇవ్వగలవని జనరల్ ద్వివేది పేర్కొన్నారు. మన పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్‌లు ఇప్పటికే ప్రత్యేక రాకెట్ ఫోర్స్ లను ఏర్పాటు చేశాయని, వాటికి దీటుగా భారత్ కూడా అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన నొక్కి చెప్పారు. ఈ దిశగా సైన్యం తన దీర్ఘ శ్రేణి దాడి సామర్థ్యాలను గణనీయంగా పెంచుకుంటోందని తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన పినాకా రాకెట్ వ్యవస్థను ఇప్పటికే 120 కిలోమీటర్ల శ్రేణితో విజయవంతంగా పరీక్షించామని, దాని సామర్థ్యాన్ని 150 కిలోమీటర్లకు పెంచేందుకు ఒప్పందాలు కూడా జరిగాయని జనరల్ ద్వివేది వివరించారు. భవిష్యత్తులో దీని శ్రేణిని 300 నుంచి 450 కిలోమీటర్లకు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని అన్నారు. పినాకా, ప్రళయ్, బ్రహ్మోస్ వంటి శక్తివంతమైన వ్యవస్థలను సమన్వయం చేస్తూ ఈ రాకెట్ ఫోర్స్ కమాండ్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఇటీవల జరిగిన 'ఆపరేషన్ సిందూర్ట గురించి మాట్లాడుతూ, పాకిస్థాన్ నుంచి వచ్చిన అణు బెదిరింపులు కేవలం రాజకీయ స్థాయిలోనే ఉన్నాయని, సైనిక స్థాయిలో (డీజీఎంవోల మధ్య) అలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఆ ఆపరేషన్ సమయంలో భారత దళాలు కేవలం 88 గంటల్లోనే భూతల దాడులకు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యాయని, పాకిస్థాన్‌కు భారీ నష్టం కలిగించాయని గుర్తుచేశారు. ఈ ఆపరేషన్ తర్వాత, పాకిస్థాన్ కూడా ప్రత్యేక రాకెట్ ఫోర్స్ ఏర్పాటు దిశగా ఆలోచిస్తోందని నివేదికలు వస్తున్నాయని ఆయన తెలిపారు.

## వయ్యారి చిత్రం



ప్రియాంక చోప్రా

## యూట్యూబ్ 'టాక్సిక్' కాదు: సెన్సార్ బోర్డు

కన్నడ స్టార్ నటుడు యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'టాక్సిక్' చిత్రం ప్రస్తుతం వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా టీజర్‌లో అశ్లీలతతో పాటు అభ్యంతరకర సన్నివేశాలు ఎక్కువగా ఉన్నాయంటూ ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆప్ రాష్ట్ర కార్యదర్శి ఉషా మోహన్ ఈ ఫిర్యాదులో పేర్కొంటూ.. టీజర్‌లోని దృశ్యాలు పిల్లల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపేలా ఉన్నాయని, తక్షణమే ఈ టీజర్‌ను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అయితే ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన మహిళా కమిషన్.. టీజర్‌లోని అభ్యంతరకర దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సెన్సార్ బోర్డుకు లేఖ రాసింది. అంతేకాకుండా, దీనిపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఈ వివాదంపై సెన్సార్ బోర్డు తాజాగా స్పందించింది. యూట్యూబ్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో విడుదలయ్యే కంటెంట్‌కు సెన్సార్ సర్టిఫికేషన్ అవసరం లేదని తెలిపింది. కేవలం థియేటర్లలో ప్రదర్శించే టీజర్లు, సినిమాలకు మాత్రమే సెన్సార్ అనుమతి తప్పనిసరని, 'టాక్సిక్' టీజర్ నేరుగా డిజిటల్ మాధ్యమాల్లో రావడంతో అది తమ పరిధిలోకి రాదని వెల్లడించింది. అంతేకాకుండా ఇప్పటివరకు చిత్రబృందం నుంచి ఎలాంటి కంటెంట్ సెన్సార్ కోసం తమ వద్దకు రాలేదని బోర్డు వెల్లడించింది.






## జీ5లో భర్త మహాశయులకు విజ్ఞప్తి

సంక్రాంతి కానుకగా థియేటర్స్ లో రిలీజ్ కి వచ్చిన లేటెస్ట్ చిత్రాల్లో థియేటర్స్ లోకి వచ్చిన చిత్రం భర్త మహాశయులకు విజ్ఞప్తి ఒకటి. మాస్ మహారాజ రవితేజ హీరోగా దర్శకుడు కిషోర్ తిరుమల కాంబినేషన్ లో తెరకెక్కించిన ఈ ఫ్యామిలీ ఎంటర్టైనర్ మంచి బజ్ ని సంతరించుకుంది. ఇక ఈ సినిమా తాలూకా పోస్ట్ థియేటర్స్ రిలీజ్ వేటిలో అందుబాటులో ఉంటుంది అనేది రివీల్ అయ్యింది. ఈ సినిమా నాన్ థియేట్రికల్ హక్కులని ఒకే సంస్థ దక్కించుకున్నారు. మరి ఈ సినిమా ఓటిటి హక్కులు జీ 5 సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఓటిటితో పాటుగా శాటిలైట్ హక్కులు కూడా జీ సంస్థనే సొంతం చేసుకోవడం విశేషం. సో జీ తెలుగు, జీ 5 లోనే ఈ సినిమా థియేటర్స్ లో రిలీజ్ తర్వాత అందుబాటులోకి వస్తుంది. ఇక ఈ చిత్రానికి భీమ్స్ సంగీతం అందించగా ఆషిక రంగనాథ్, డింపుల్ హయతిలు హీరోయిన్స్ గా నటించారు. అలాగే ఎస్ ఎల్ వి సినిమాస్ వారు నిర్మాణం వహించారు.

## క్లైమాక్స్ లో పెద్ది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథనాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో పెద్ది తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఆర్సీ 16వ చిత్రంగా ప్రేక్షకుల ముందుకొస్తుంది. అన్ని పనులు పూర్తి చేసి పాన్ ఇండియాలో మార్చి 27న ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రిలీజ్ తేదీ విషయంలో టీమ్ ఎక్కడా రాజీ పడటం లేదు. ఎట్టి పరిస్థితుల్లో చెప్పిన తేదికే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని బుచ్చిబాబు అండ్ కో పని చేస్తుంది. ఇప్పటికే షూటింగ్ దాదాపు ముగింపు దశకు చేరుకుంది. లిరికల్స్ సింగిల్స్ రూపంలో ప్రచారం కూడా మొదలు పెట్టారు. తొలి లిరికల్ చికిరి చికిరి పాట ఏ రేంజ్ లో కనెక్ట్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. అన్ని పాటల రికార్డులను చికిరి చికిరి తిరగరాసింది. మోస్ట్ లవ్ బుల్ సాంగ్ గా నెట్టింట ట్రెండింగ్ లో నిలిచింది. రెహమాన్ ఈజ్ బ్యాక్ అనిపించిన సాంగ్ ఇది. చాలా కాలం తర్వాత రెహమాన్ తెలుగు సినిమాకు పనిచేయడం ...తొలి సాంగ్ సక్సెస్ అవ్వడంతో అతడు అంతే సంతోషంగా ఉన్నాడు. తర్వాత రిలీజ్ అయ్యే పాటలు ఎలా ఉంటాయి? అని శ్రోతల్లో ఆసక్తి పెరిగిపోతుంది. ఈనేపథ్యంలో తాజాగా షూటింగ్ అప్ డేట్ కూడా వచ్చేసింది. బ్యాలెన్స్ షూటింగ్ చకాచకా పూర్తి చేస్తున్నారు. దీనిలో భాగంగా క్లైమాక్స్ షూట్ హైదరాబాద్ లో ప్రారంభమైంది. ఓ భారీ సెట్ లో చరణ్ సహా ప్రధాన పాత్రలపై కీలక సన్నివేశాలతో పాటు, యాక్షన్ ఎపిసోడ్స్ ను చిత్రీకరిస్తున్నారు. సినిమాకు ఈ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని టీమ్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ప్రథమార్థం కట్ మొత్తం సిద్దమైందని నిర్మాణ వర్గాల నుంచి అందుతోన్న సమాచారం. అందులో మరేవ్వరు క్రాస్ చెక్ చేయాల్సిన పని కూడా లేదు. అంత కాన్ఫిడెంట్ గా బుచ్చిబాబు ప్రథమార్థం రెడీ చేసి పెట్టాడు. అలాగే సెకాండాఫ్ కి సంబంధించిన నిర్మాణ పనులు కూడా అంతే వేగంగా జరుగుతున్నాయి. అందుకోసం టీమ్ రేయింబవళ్లు శ్రమిస్తోంది. ఈ నెలఖరుకల్లా టాకీ పార్ట్ మొత్తం పూర్తి చేయడమే టార్గెట్ గా పని చేస్తున్నారు. మొత్తానికి జనవరి కల్లా టీమ్ రిలాక్స్ అయిపోతుందని తెలుస్తోంది. బుచ్చిబాబు తన రెండవ సినిమాకు సంబంధించి కూడా షూట్ అంతా ఇండియాలోనే చేసాడు. విదేశాలకు వెల్లింది లేదు. పాటల కోసం కూడా ఆ ఛాన్స్ తీసుకోలేదు. స్టోరీ ఆధారంగా టాకీ సహా పాటల చిత్రీకరణ కూడా ఇక్కడే ముగించాడు. ఇలా చేయడం వల్ల నిర్మాతకు చాలా వరకూ ఖర్చు ఆదా అవుతుంది. తొలి సినిమా ఉప్పెన కూడా బుచ్చిబాబు అలాగే పూర్తి చేసాడు. చరణ్ సినిమాకు సైతం అదే స్ట్రాటజీ అనుసరిస్తున్నాడు.



## బాలీవుడ్‌లో అన్నీ పీఆర్ స్టంట్లే

బాలీవుడ్ నటి తాప్సీ పన్ను ఇటీవల హిందీ చిత్ర పరిశ్రమలో పెరుగుతున్న పబ్లిసిటీ సంస్కృతిపై తన అభిప్రాయాన్ని బహిరంగంగా వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో బాలీవుడ్‌లో పీఆర్ వ్యూహాలు పూర్తిగా మారిపోయాయని, ఇప్పుడు ప్రమోషన్ అనేది కేవలం తమ సినిమా గురించి మాట్లాడటానికే పరిమితం కాకుండా, ఇతరులను తక్కువగా చూపించే స్థాయికి వెళ్లిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొన్ని పీఆర్ టీమ్స్ తమ సినిమాలకు హైప్ క్రియేట్ చేయడానికి ఇతర నటులు, సినిమాలపై నెగటివ్ కథనాలు ప్లాంట్ చేస్తున్నాయి. ఇది ఒక రకమైన పోటీ కాదు, పూర్తిగా తప్పుదారి పట్టిన విధానం" అని వ్యాఖ్యానించారు. సినిమా కంటెంట్, నటన, కథ బలం గురించి మాట్లాడాల్సిన చోట, వ్యక్తిగత విమర్శలు లేదా ఇతరులపై నిందలు వేయడం ట్రెండ్‌గా మారిందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇలాంటి పీఆర్ గేమ్స్‌లో తాను ఎప్పుడూ భాగం కాలేదని తాప్సీ స్పష్టం చేశారు. నేను అలాంటి వ్యూహాలకు దూరంగా ఉండటం పట్ల చాలా రిలీఫ్‌గా ఫీలవుతున్నాను. నా పని నా సినిమాల ద్వారా మాట్లాడాలని నమ్ముతాను. ఇతరులను కిందకు లాగి పైకి రావడం నాకు ఇష్టం లేదు అని ఆమె తెలిపారు. ఈ మాటలు ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన పోటీ అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని సినీ విశ్లేషకులు అంటున్నారు. తాప్సీ వ్యాఖ్యలు బాలీవుడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం స్టార్ ఇమేజ్, సోషల్ మీడియా ట్రెండ్స్, వైరల్ కథనాలే సినిమాల భవితవ్యాన్ని నిర్ణయిస్తున్న సమయంలో, ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు పీఆర్ వ్యవస్థపై పెద్ద చర్చకు దారి తీస్తున్నాయి. చాలా మంది నెటిజన్లు తాప్సీ అభిప్రాయాలకు మద్దతు తెలుపుతూ, "సినిమా హిట్ కావాలంటే కంటెంట్ ఉండాలి కానీ కాంట్రవర్సీలు కాదు" అంటూ కామెంట్లు చేస్తున్నారు.





## మార్చిలో కల్కి 2కి ముహూర్తం?

ఒకేసారి రెండు..మూడు ప్రాజెక్ట్ లు పట్టాలెక్కించడం ప్రభాస్ ప్రత్యేకత. ఏక కాలంలో వాటి షూటింగ్స్ లో పాల్గొనడం లోనూ డార్లింగ్ అంతే ఘనుడు. గత ఏడాది రాసాజాబ్, ఫౌజీ షూటింగ్ లతో బిజీగా గడిపాడు. ఎట్టకేలకు రాజాసాబ్ అన్ని అవాంతరాలు దాటుకుని 9న రిలీజ్ అయిపోయింది. ఆ సినిమా ఫలితం సంగతి పక్కన బెడితే ప్రభాస్ మెరుపు వేగంగా షూటింగ్ పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ లున్నాయి. ఇప్పటికే ఫౌజీ షూటింగ్ చాలా వరకూ పూర్తయింది. భారీ పీరియాడిక్ చిత్రం కావడంతో రాజాసాబ్ ని పక్కనబెట్టి మరీ ఆ షూటింగ్ కి హాజరయ్యాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కి బ్రేక్ ఇచ్చి సందీప్ రెడ్డి వంగా ప్రాజెక్ట్ స్పిరిట్ ని పట్టాలెక్కించాడు. రాజాసాబ్ ప్రచారం అనంతరం డార్లింగ్ విదేశాలకు వెకేషన్ కు వెళ్లాడు. మరో రెండు..మూడు రోజుల్లో తిరిగి రానున్నాడు. సంక్రాంతి సెలవుల అనంతరం తిరిగి స్పిరిట్ షూటింగ్ లో పాల్గొంటాడు. ప్రస్తుతం సందీప్ ప్రభాస్ లేని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే కల్కి 2 అప్ డేట్ కూడా తెరపైకి వస్తోంది. ఈ సినిమా షూటింగ్ ఫిబ్రవరి ముగింపు లేదా మార్చి తొలి వారంలో మొదలు పెట్టాలని దర్శకుడు నాగ్ అశ్విన్ భావిస్తున్నాడట. ప్రభాస్ లేకుండానే షూట్ ప్లాన్ చేస్తున్నారట.

## జపాన్‌లో బన్నీ.. తగ్గేదేలే!

ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన 'పుష్పరాజ్' ఇప్పుడు జపాన్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యాడు. జనవరి 16న జపాన్‌లో 'పుష్ప 2: ది రూల్' భారీ స్థాయిలో విడుదల కానున్న నేపథ్యంలో, ఈ చిత్ర ప్రమోషన్ల కోసం బన్నీ స్వయంగా రంగంలోకి దిగారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన కుటుంబంతో కలిసి జపాన్ రాజధాని టోక్యోకు చేరుకున్నారు. సోమవారం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భార్య స్నేహా రెడ్డి, పిల్లలు అయాన్, అర్హలతో కలిసి కనిపించిన బన్నీ నేడు టోక్యో చేరుకున్నట్లు తెలుస్తుంది.








బంగ్లాకు ఐసీసీ స్పష్టీకరణ

# భారత్‌లోనే ఆడాలి!

భారత్‌లో త్వరలో మొదలయ్యే పొట్టి ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ ఆడడంపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఐసీసీ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని బీసీసీఐ స్పష్టం చేయడంతో వేదిక మార్పు తప్పదేమో? అనిపించింది. కానీ, ఇండియాలోనే ప్రపంచకప్ ఆడేలా బంగ్లాదేశ్ బోర్డును ఒప్పించేందుకు ఐసీసీ పావులు కదుపుతోంది. ఈ మేరకు భారత్‌లో వరల్డ్‌కప్ ఆడబోమనే నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని ఐసీసీ తమను కోరిందని మంగళవారం బీసీబీ వెల్లడించింది. టీ20 ప్రపంచకప్ కోసం ఇండియాకు తమ జట్టును పంపబోమని బంగ్లాదేశ్ బోర్డు తేల్చి చెప్పిన నేపథ్యంలో ఐసీసీ రంగంలోకి దిగింది. ఎలాగైనా బీసీబీ తమ నిర్ణయాన్ని మార్చుకునేలా చేసేందుకు ప్రయత్నిస్తోంది. మంగళవారం బీసీబీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది ఐసీసీ. 'ఈ సందర్భంగా ఇదివరకు చెప్పినట్టుగానే భద్రతా కారణాల రీత్యా భారత్‌కు తమ జట్టును పంపబోమని బంగ్లాదేశ్ బోర్డు చెప్పింది. భారత్‌లో కాకుండా ఇతర దేశాల్లో తమ జట్టు మ్యాచ్‌లు నిర్వహించాలని ఐసీసీ కోరింది. అయితే.. ఐసీసీ మాత్రం అందుకు సిద్ధంగా లేదనిపిస్తోంది. ఎందుకంటే ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించినందున నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరింది. అయితే.. మా బోర్డు సభ్యులం మాత్రం అందుకు అంగీకరించలేదు. అయితే.. పరిష్కారం లభించేంతవరకూ చర్చలు జరపాలని ఐసీసీ, బీసీబీ అనుకుంటున్నాయి. బంగ్లా క్రికెటర్ల భద్రతకు బీసీబీ కట్టుబడి ఉంది. ఈ విషయమై అధికారులు, సిబ్బంది ఐసీసీతో సంప్రదింపులు జరుపుతున్నారు' అని బీసీబీ తెలిపింది.

## కోల్‌కతాలో 3 మ్యాచ్‌లు

పొట్టి ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ గ్రూప్ సీలో ఉంది. షెడ్యూల్ ప్రకారం బంగ్లాదేశ్ జట్టు కోల్‌కతాలో మూడు లీగ్ మ్యాచ్‌లు ఆడాలి. ఫిబ్రవరి 7న వెస్టిండీస్‌తో, ఫిబ్రవరి 8న ఇటలీతో, ఫిబ్రవరి 14న ఇంగ్లండ్‌తో లిటన్ దాస్ సేన తలపడాలి. కానీ, తాజా ఉద్రికత్తల నేపథ్యంలో బంగ్లాదేశ్ బోర్డు తమ జట్టును భారత్‌కు పంపేందుకు సుముఖంగా లేదు.

International Cricket Council



అలిస్సా హీలీ

# రిటైర్మెంట్

మహిళా క్రికెట్ ప్రపంచంలో ఓ అద్భుత అధ్యాయం ముగియనుంది. ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టుకు వెన్నెముకగా నిలిచిన స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్, ప్రస్తుత కెప్టెన్ అలిస్సా హీలీ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. ఈ ఏడాది మార్చిలో భారత్‌తో జరగనున్న స్వదేశీ సిరీస్ తర్వాత ఆమె ఆటకు వీడ్కోలు పలకనున్నారు. 35 ఏళ్ల హీలీ పెర్త్‌లో భారత్‌తో జరగనున్న మూడు వన్డేలు, ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో ఆఖరిసారిగా ఆస్ట్రేలియాకు సారథ్యం వహించనున్నారు. అయితే ఈ ఏడాది బ్రిటన్‌లో జరగనున్న టీ20 ప్రపంచకప్ ఆడకూడదని నిర్ణయించుకున్నందున, భారత్‌తో జరిగే టీ20 సిరీస్‌కు ఆమె అందుబాటులో ఉండరు. స్వదేశీ మైదానంలో బలమైన భారత జట్టుపై ఆడుతూ కెరీర్‌ను ముగించడం తనకు దక్కిన గౌరవంగా ఆమె భావిస్తున్నారు. తన రిటైర్మెంట్ నిర్ణయంపై హీలీ స్పందిస్తూ.. "దేశం కోసం ఆడాలనే తపన నాలో ఇంకా ఉంది. కానీ మైదానంలో గెలవాలనే ఆ తీవ్రమైన పోటీ తత్వం నాలో కొంచెం తగ్గినట్లు అనిపిస్తోంది. అందుకే ఆగిపోవడానికి ఇదే సరైన సమయమని నిర్ణయించుకున్నాను. గాయాలతో పోరాడుతూ వికెట్ల వెనుక డైవ్‌లు చేయడం ఇప్పుడు కొంచెం భారంగా మారుతోంది" అని నిజాయితీగా పేర్కొన్నారు.

**హీలీ కెరీర్ గణాంకాలు:**

**టెస్టులు: 10 మ్యాచ్‌లు - 489 పరుగులు (సగటు 30.56)**

**వన్డేలు: 123 మ్యాచ్‌లు - 3563 పరుగులు (సగటు 35.98, 7 సెంచరీలు)**

**టీ20లు: 162 మ్యాచ్‌లు - 3054 పరుగులు (సగటు 25.45, 1 సెంచరీ)**



# మేరీ కోమ్‌కు ఎసర్రు!

## మాజీ భర్త సంచలన వ్యాఖ్యలు

భారత దిగ్గజ బాక్సర్, ఒలింపిక్ విజేత మేరీ కోమ్ దాంపత్య జీవితం ఇప్పుడు వీధిన పడింది. గత కొన్ని రోజులుగా మేరీ కోమ్ తన భర్త ఓన్లర్ కోమ్‌పై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. అయితే తాజాగా ఓన్లర్ ఈ ఆరోపణలను తిప్పికొట్టడమే కాకుండా, మేరీ కోమ్ వ్యక్తిగత జీవితం గురించి సంచలన విషయాలను బయటపెట్టారు. మేరీ కోమ్ తనను మోసం చేసిందని, పెళ్లయిన తర్వాత కూడా ఆమెకు ఇతర వ్యక్తులతో సంబంధాలు ఉన్నాయని ఓన్లర్ ఆరోపించారు. 2013లో మేరీ కోమ్ ఒక జూనియర్ బాక్సర్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుందని ఓన్లర్ పేర్కొన్నారు. దీనివల్ల అప్పట్లో తమ మధ్య పెద్ద గొడవ జరిగిందని, ఆ తర్వాత సర్దుకున్నామని చెప్పారు. తిరిగి 2017లో తన అకాడమీకి చెందిన మరో వ్యక్తితో ఆమె సంబంధాన్ని కొనసాగించిందని ఓన్లర్ వెల్లడించారు. దీనికి సంబంధించి తన దగ్గర వాట్సాప్ చాట్స్, పక్కా ఆధారాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. మేరీ కోమ్ తనపై చేసిన ఆర్థిక మోసం ఆరోపణలను ఓన్లర్ ఖండించారు. 'నేను రూ. 5 కోట్లు దొంగిలించానని ఆమె అంటోంది. నా బ్యాంక్ ఖాతా చెక్ చేసుకోవచ్చు. నిందలు వేయడం కాదు, ఆధారాలు చూపించాలి' అని సవాల్ విసిరారు. అంతేకాకుండా మేరీ కోమ్ అలవాట్ల గురించి మాట్లాడుతూ.. 'నేను మద్యం తాగుతానని ఆమె అంటోంది, కానీ ఆమె కూడా వోడ్కా, రమ్ తాగుతుంది. ఆమెకు గుట్కా తినే అలవాటు కూడా ఉంది. ఈ విషయాలు నేను ఎప్పుడూ మీడియాకు చెప్పలేదు' అని ఓన్లర్ వ్యాఖ్యానించారు. తమకు ఇప్పటికే గిరిజన ఆచారాల ప్రకారం విడాకులు అయ్యాయని.. కానీ ఇంకా కోర్టు ప్రక్రియ పూర్తి కాలేదని ఓన్లర్ తెలిపారు. 'నేను నా పిల్లలను ప్రేమిస్తున్నాను. వారి భవిష్యత్తు కోసం నేను కోర్టులో పోరాడాలని అనుకోవడం లేదు. కానీ నేషనల్ మీడియా ముందు నాపై అబద్ధపు ఆరోపణలు చేయడం సరికాదు' అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2022 కామన్వెల్త్ గేమ్స్ సమయంలో మేరీ కోమ్ గాయపడినా ముంబైకి వెళ్లి మరో వ్యక్తితో సమయం గడిపిందని ఆరోపించారు.

# స్టోక్స్, మెక్‌కల్లమ్ డిష్యుం డిష్యుం




యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా చేతిలో ఇంగ్లాండ్ 4-1తో ఘోర పరాజయాన్ని చవిచూసింది. అయితే ఈ ఓటమి కంటే కూడా జట్టు క్రమశిక్షణ, ఆటగాళ్ల ప్రవర్తనకు సంబంధించిన దిగ్భ్రాంతికరమైన విషయాలు ఇప్పుడు బయటకు వస్తున్నాయి. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్, హెడ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు తలెత్తినట్లు నివేదికలు చెబుతున్నాయి. 'ది టెలిగ్రాఫ్ ' నివేదిక ప్రకారం.. ఆస్ట్రేలియా పర్యటనలో ఇంగ్లాండ్ జట్టు ప్రదర్శన కంటే వివాదాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. ఆటగాళ్లు మైదానంలో కంటే క్యాసినో టేబుళ్ల వద్దే ఎక్కువ సమయం గడిపినట్లు తెలుస్తోంది. ఇంగ్లాండ్ జట్టు బస చేసిన 'క్రౌన్ టవర్ణ్ హోటల్ ఓ విలాసవంతమైన క్యాసినో కాంప్లెక్స్. ఆటగాళ్లు పదేపదే క్యాసినోకు వెళ్తూ, మద్యం సేవిస్తూ అభిమానుల కంటపడ్డారు. బాక్సింగ్ డే టెస్టుకు ముందు యువ ఆటగాడు జాకబ్ బెథెల్ వేపింగ్ చేస్తూ కెమెరాకు చిక్కగా.. ఓపెనర్ బెన్ డకెట్ మద్యం మత్తులో కనీసం టాక్సీ కూడా ఎక్కలేనంత స్థితిలో ఉన్న వీడియో వైరల్ అయ్యింది. కొందరు ఆటగాళ్లు వరుసగా ఆరు రోజుల పాటు మద్యం సేవించినట్లు సమాచారం. ఇది వారి ఫిట్‌నెస్, ఆటపై తీవ్ర ప్రభావం చూపింది. 2022 నుంచి కలిసి పనిచేస్తున్న కెప్టెన్ బెన్ స్టోక్స్, కోచ్ బ్రెండన్ మెకల్లమ్ మధ్య సంబంధాలు ఈ సిరీస్ సందర్భంగా దెబ్బతిన్నాయి. బ్రిస్బేన్ డే-నైట్ టెస్టుకు ముందు స్టోక్స్ కఠినమైన శిక్షణ కోరుకోగా.. మెకల్లమ్ మాత్రం ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి వారిపై ఒత్తిడి తగ్గించాలని భావించారు. ఆస్ట్రేలియా టెయిల్ ఎండర్లను ఔట్ చేయడంలో స్టోక్స్ అనుసరించిన రక్షణాత్మక వ్యూహాలు మెకల్లమ్‌కు నచ్చలేదు. స్టోక్స్ ఒత్తిడిలో తడబడుతున్నాడని మెకల్లమ్ భావించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. స్టోక్స్ జట్టులోని ఆటగాళ్లను 'బలహీనులు' అని విమర్శించగా, మెకల్లమ్ మాత్రం జట్టు అవసరానికి మించి ప్రాక్టీస్ చేసిందని భిన్నమైన ప్రకటనలు ఇచ్చారు.

# మంజ్రేకర్‌వి పిచ్చి కూతలు: కైఫ్

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఈజీ ఫార్మాట్‌ను ఎంచుకున్నాడని వివాదాస్పద కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ చేసిన వ్యాఖ్యలపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ఘాటుగా స్పందించాడు. సంజయ్ మంజ్రేకర్‌వి పిచ్చి కూతలు అని మండిపడ్డాడు. ప్రపంచంలోనే విరాట్ కోహ్లీ అత్యుత్తమ ఆల్ ఫార్మాట్ ప్లేయర్ అని, అతనికి దరిదాపుల్లో కూడా ఎవరూ లేరని స్పష్టం చేశాడు. అయినా క్రికెట్‌లో ఏ ఫార్మాట్ కూడా అంత సులువు కాదని అభిప్రాయపడ్డాడు. ఓ చర్చా కార్యక్రమంలో విరాట్ కోహ్లీపై సంజయ్ మంజ్రేకర్ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ సులువైన ఫార్మాట్ ఎంచుకున్నాడని చులకనగా మాట్లాడాడు. తన లోపాలను సరిదిద్దుకోకుండా టెస్ట్‌లకు వీడ్కోలు పలికాడని అభిప్రాయపడ్డాడు. జోరూట్, కేన్ విలియమ్సన్, స్టీవ్ స్మిత్ టెస్ట్‌ల్లో రాణిస్తుంటే.. కోహ్లీ తప్పుకున్నాడని, అతని నిర్ణయం తనకు నచ్చలేదన్నాడు. విరాట్ అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించినా బాగుండేదని, టాపార్డర్ బ్యాటర్‌కు ఎంతో సులువైన వన్డేల్లో కొనసాగుతూ తనను మరింత నిరాశకు గురి చేశాడని మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. కోహ్లీ అన్న వికాస్ కోహ్లీ అయితే మంజ్రేకర్ పేరు ప్రస్తావించకుండా ఘాటుగా కామెంట్స్ చేశాడు. కోహ్లీ పేరు ఎత్తనిది పూట గడవదని మండిపడ్డాడు. తాజాగా రవి బిష్త్ అనే యూట్యూబర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంజయ్ మంజ్రేకర్ వ్యాఖ్యలపై కైఫ్ మండిపడ్డాడు. 'ప్రపంచంలోనే అన్ని ఫార్మాట్లలో విరాట్ కోహ్లీ అత్యుత్తమ ఆటగాడు. అతనికి దరిదాపుల్లో కూడా మరే ఆటగాడు లేడు. మీరు ఎవరి పేరు చెప్పినా.. వారు కోహ్లీ దరిదాపుల్లోకి కూడా రాలేరు. ఇక అతను కష్టతరమైన ఫార్మాట్ నుంచి వైదొలిగాడని చెప్పే వారికి నేను ఒకటే చెప్పదలుచుకున్నాను. విరాట్ కోహ్లీ ఆ కష్టతరమైన ఫార్మాట్‌లో కూడా 9,000 పైగా పరుగులు చేసి, 30 సెంచరీలు సాధించి తనను తాను నిరూపించుకున్నాడు. కాబట్టి, అతను కష్టమైన ఫార్మాట్‌ను వదిలేసి సులువైన ఫార్మాట్‌ను ఎంచుకున్నాడని అనడం మూర్ఖత్వమే అవుతుంది. క్రికెట్‌లో ఏ ఫార్మాట్ కూడా సులువు కాదు.'అని కైఫ్ స్పష్టం చేశాడు.



**గంభీర్.. ఈ స్టార్ కల్చర్ ఏంది?**

భారత జట్టులో సూపర్ స్టార్ కల్చర్‌ను అంతం చేయాలని, ఆటగాళ్లంతా సమానేమనని, జట్టు కంటే ఎవరూ గొప్ప కాదని తరుచూ చెప్పే హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ నిలదీసాడు. జట్టులో ఆటగాళ్లందర్నీ ఒకేలా ఎందుకు చూడటం లేదని ప్రశ్నించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఒకలా.. స్పిన్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను మరోలా చూడటం ఏంటని నిలదీసాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
బుధవారం 14-1-2026




# రక్తాక్షరాల చరిత్ర.. మేడారం!



**తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లాలోని దండకారణ్యం మధ్యలో వెలసిన మేడారం గ్రామం ఇప్పుడు ప్రపంచ పటంలో ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోంది. కులమతాలకు అతీతంగా, సరిహద్దుల భేదం లేకుండా కోట్లాది మంది ప్రజలను ఏకతాటిపైకి తెచ్చే శక్తి మేడారం సొంతం. ఇది కేవలం ఒక జాతర కాదు; అన్యాయంపై అడవి బిడ్డలు చేసిన పోరాట చరిత్ర. మేడారం జాతర వెనుక ఉన్న చరిత్ర రక్తాక్షరాలతో రాసినది. 13వ శతాబ్దంలో కాకతీయ చక్రవర్తుల పాలనలో ఉన్నప్పుడు, మేడారం ప్రాంతం తీవ్రమైన కరువుకు గురైంది. ఆ సమయంలో జరిగిన యదార్థ గాథ ఇది.**

జానపద కథల ప్రకారం, కోయ గిరిజన పెద్దలకు అడవిలో పులుల మధ్య ఆడుకుంటున్న ఒక పసిపాప దొరికింది. ఆమెను సమ్మక్కగా నామకరణం చేసి పెంచారు. ఆమె పెరిగే కొద్దీ అద్భుతమైన వైద్య శక్తులతో, ప్రజల కష్టాలను తీర్చే ఇల్లాలుగా పేరొందింది. మేడారం పాలకుడైన పగిడిద్ద రాజుతో సమ్మక్క వివాహం జరిగింది. కాకతీయ సామంతులుగా ఉన్న వీరు, కరువు వల్ల ప్రజలు ఆకలితో అలమటిస్తుంటే కప్పం (పన్ను) కట్టలేమని తేల్చి చెప్పారు. దీనిని ధిక్కారంగా భావించిన కాకతీయ సేనలు మేడారంపై దాడి చేశాయి. యుద్ధంలో పాగిడిద్ద రాజు, కుమారులు జంపన్న, కుమార్తెలు సారలమ్మ, నాగులమ్మ వీరోచితంగా పోరాడి ప్రాణాలు వదిలారు. చివరకు సమ్మక్క తానే స్వయంగా యుద్ధరంగంలోకి దిగి శత్రువులను హడలెత్తించింది. గాయపడిన స్థితిలో ఆమె చిలుకలగుట్ట వైపు వెళ్లి అదృశ్యమైంది. వెతికిన అనుచరులకు అక్కడ ఒక కుంకుమ భరిణె మాత్రమే దొరికింది. దాన్నే సమ్మక్క స్వరూపంగా భావించి గిరిజనులు పూజించడం ప్రారంభించారు. మేడారం జాతర అత్యంత క్రమశిక్షణతో, సంప్రదాయబద్ధంగా జరుగుతుంది.

### నాలుగు ప్రధాన ఘట్టాలు:

మొదటి రోజు (సారలమ్మ రాక): కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకువస్తారు. గిరిజన పూజారులు అత్యంత గోప్యంగా, వాద్యాల మధ్య అమ్మవారిని ప్రతిష్ఠిస్తారు.

రెండూ రోజు (సమ్మక్క రాక): చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను కుంకుమ భరిణె రూపంలో గద్దెపైకి తీసుకువస్తారు. ఈ సమయంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ వంటి ఉన్నతాధికారులు గాలిలోకి కాల్పులు జరిపి ప్రభుత్వ లాంఛనాలతో స్వాగతం పలకడం ఒక విశేషం.

మూడవ రోజు (మహా దర్శనం): ఈ రోజే భక్తుల రద్దీ అత్యధికంగా ఉంటుంది. కోట్లాది మంది భక్తులు గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటారు.

నాల్గవ రోజు (వనప్రవేశం): దేవతలు తిరిగి అడవిలోకి వెళ్లడంతో జాతర ముగుస్తుంది.

విగ్రహాలు లేని ఆధ్యాత్మికత: హిందూ మతంలోని ఇతర పండుగలకు, మేడారం జాతరకు చాలా తేడా ఉంది. ఇక్కడ వైదిక మంత్రాలు, విగ్రహాలు ఉండవు. ఇక్కడ దేవాలయాలు ఉండవు. కేవలం మట్టి గద్దెలే పీఠాలు. ప్రకృతియే ఆలయం. భక్తులు తమ బరువుకు సమానంగా బెల్లాన్ని అమ్మవార్లకు సమర్పించుకుంటారు. దీనిని 'తులాభారం' అంటారు. బెల్లం ఇక్కడ అత్యంత పవిత్రమైనది. భక్తులు పూనకంతో ఊగిపోతూ అమ్మవార్లను దర్శించుకోవడం ఇక్కడి గిరిజన సంస్కృతికి అద్దం పడుతుంది. జాతరకు వెళ్లే ప్రతి ఒక్కరూ జంపన్న వాగులో స్నానం చేయడం ఆచారంగా వస్తోంది. సమ్మక్క కుమారుడైన జంపన్న, యుద్ధంలో గాయపడి ఈ వాగులో పడి మరణించాడని చరిత్ర చెబుతోంది. ఆయన రక్తంతో ఈ వాగు ఎర్రబడింది. అందుకే నేటికీ ఈ నీరు స్వల్ప ఎరుపు రంగులో కనిపిస్తుందని భక్తుల నమ్మకం. ఈ వాగులో స్నానం చేయడం వల్ల చర్మ వ్యాధులు తగ్గుతాయని, పుణ్యం లభిస్తుందని నమ్ముతారు. మేడారం జాతర కేవలం భక్తికి పరిమితం కాలేదు. ఇది ఒక భారీ సామాజిక ఇంజిన్. ఈ జాతర ద్వారా వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుంది. రవాణా, ఆహారం, వస్తువుల విక్రయాల ద్వారా లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుంది. అంతరించిపోతున్న కోయ, గోండు తెగల ఆచారాలు, వారి భాష, కళలు ఈ వేదిక ద్వారా ప్రపంచానికి తెలుస్తున్నాయి. ఇక్కడ పేద, ధనిక తేడా ఉండదు. చెట్ల కిందే వంటలు చేసుకుని, టెంట్ల కిందే పడుకుంటూ భక్తులు గడిపే జీవనం 'సమ సమాజ' భావనను చాటుతుంది. నేటి కాలంలో మేడారం వంటి జాతరలు మనకు పర్యావరణం పట్ల బాధ్యతను గుర్తుచేస్తాయి. అడవిని దైవంగా భావించే గిరిజన సంస్కృతిని మనం అలవరచుకోవాలి. మేడారం మహాజాతర అనేది తెలంగాణ గుండెచప్పుడు. ఇది పౌరుషానికి, త్యాగానికి, భక్తికి నెలవు. సమ్మక్క–సారలమ్మలు కేవలం గిరిజన దేవతలు మాత్రమే కాదు, అన్యాయంపై తిరగబడే ప్రతి గొంతుకకు వారు స్ఫూర్తి. జనవరి 14న ప్రారంభం కానున్న ఈ మహా ఘట్టం, మానవ సంబంధాలను బలపరుస్తూ, ప్రకృతిని ప్రేమించే గొప్ప గుణాన్ని మనలో నింపాలి.

**- రామయ్య ఇంద్రగంటి**
చరిత్రకారుడు, వరంగల్ జిల్లా



**నేటి ప్రపంచం అరచేతిలో ఇమిడిపోయింది. సమాచార విప్లవం మనిషిని ప్రపంచానికి దగ్గర చేసి ఉండవచ్చు కానీ, పక్కనున్న మనిషికి దూరం చేస్తోంది. స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్ల మధ్య బందీ అయిన నేటి తరానికి మకర సంక్రాంతి కేవలం ఒక సెలవు దినం కాదు, అది ఒక సంస్కృతి చికిత్స. మన మూలాలను వెతుక్కుంటూ, మట్టి వాసనను ఆస్వాదిస్తూ, పల్లెతల్లి ఒడిలో సేదతీరాల్సిన అవసరం మునుపటి కంటే ఇప్పుడు చాలా ఎక్కువగా ఉంది. సంక్రాంతి సంబరాలు భోగితో మొదలవుతాయి. భోగి మంటలు కేవలం చలిని తరిమేవి మాత్రమే కావు, అవి ఒక మానసిక ప్రక్షాళన. పాత భోగి మంటల్లో పాత వస్తువులను వేయడం అంటే, మనలోని ప్రతికూల ఆలోచనలు, ద్వేషం, అసూయ వంటి 'పాత' గుణాలను వదిలేయాలని అర్థం.**

# పల్లె.. సంక్రాంతి సిరిమల్లె!

మేడి, రావి, జమ్మి వంటి ఔషధ గుణాలున్న చెక్కలను కాల్చడం ద్వారా వచ్చే పొగ గాలిని శుద్ధి చేస్తుంది. నేటి కాలుష్యమయ వాతావరణంలో ఇటువంటి సంప్రదాయాల్లోని శాస్త్రీయతను గుర్తించాలి. భారతీయ సంస్కృతిలో సూర్యుడు ప్రత్యక్ష దైవం. మకర సంక్రాంతి రోజున సూర్యుడు ఉత్తరాయణ పుణ్యకాలంలోకి ప్రవేశిస్తాడు. ఏ కాలంలో ఏ పంట పండుతుందో, ఏ ఆహారం తీసుకోవాలో ప్రకృతిని చూసి నేర్చుకోవాలని ఈ పండుగ చెబుతుంది. మనం అనుభవిస్తున్న ఆహారం వెనుక సూర్యుడు, భూమి, నీరు మరియు గాలి ఉన్నాయని గుర్తుచేస్తూ కృతజ్ఞత తెలపడం నేటి 'వినియోగదారుల సంస్కృతి'లో చాలా అవసరం. ఇక, వాకిలిని అందమైన ముగ్గులతో, ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలతో అలంకరించడం వెనుక లోతైన అర్థం ఉంది.ముగ్గులు వేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. చుక్కల ముగ్గులలో ఉన్న జ్యామితి మన పూర్వీకుల మేధస్సుకు నిదర్శనం.ఆవు పేడ, పసుపు సహజసిద్ధమైన క్రిమిసంహారకాలు. చలికాలంలో వ్యాపించే బ్యాక్టీరియాలను అరికట్టడానికి ఇవి దోహదపడతాయి. నేటి శానిటైజర్ల కాలంలో ఈ సహజ పద్ధతుల ప్రాముఖ్యాన్ని తక్కువ అంచనా వేయలేం. గ్రామీణ వ్యవస్థలో ఆర్థిక వనరులు అందరికీ సమానంగా అందాలనేది సంక్రాంతి ఇచ్చే గొప్ప సందేశం. రైతు పండించిన పంటలో కొంత భాగాన్ని కళాకారులకు (గంగిరెద్దుల వారు), ఆధ్యాత్మిక వేత్తలకు (హరిదాసులు), చేతివృత్తుల వారికి పంపిణీ చేయడం ద్వారా సమాజం ఒకే కుటుంబం అనే భావన బలపడుతుంది. అంతరించిపోతున్న జానపద కళలకు ఊపిరి పోయడానికి సంక్రాంతి ఒక వేదిక. వ్యవసాయంలో రైతుకు చేదోడు వాదోడుగా నిలిచే పశువులను పూజించడమే కనుమ ఉద్దేశం. యంత్రాల యుగంలో మనం ఎద్దులను, ఆవులను మరచిపోతున్నాం. కానీ పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర కీలకం. ప్రకృతిలోని ప్రతి ప్రాణికి జీవించే హక్కు ఉందని, వాటి సేవలకు మనం రుణపడి ఉన్నామని ఈ పండుగ గుర్తు చేస్తుంది. సంక్రాంతికి చేసే అరిసెలు, నువ్వుల లడ్డూలు, పులగం కేవలం రుచి కోసం మాత్రమే కాదు.. నువ్వుల్లో ఉండే కాల్షియం, బెల్లంలో ఉండే ఐరన్ మన శరీరానికి బలాన్ని ఇస్తాయి. మైదాతో చేసిన ఫాస్ట్ ఫుడ్స్ కంటే, సంప్రదాయ ధాన్యాలతో చేసే పిండివంటలు ఎంతో మేలైనవని నేటి తరానికి వివరించాలి. పండుగ జరుపుకోవడంలో ఉన్న ఉత్సాహం అత్యంత అవసరం. సామూహిక ఆటలు, గాలిపటాలు ఎగురవేయడం వంటి ఆరోగ్యకరమైన వినోదానికి ప్రాధాన్యం ఇవ్వాలి. కేవలం పండుగకు వెళ్ళడం మాత్రమే కాకుండా, మన సొంత గ్రామాల్లో విద్య, వైద్య సౌకర్యాల మెరుగుదలకు పట్టణాల్లో స్థిరపడిన వారు కృషి చేయాలి. చివరగా.. సంక్రాంతి అంటే గతం గురించి గొప్పలు చెప్పుకోవడం కాదు, గతాన్ని వర్తమానంతో అనుసంధానిస్తూ మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవడం. కాంక్రీట్ అడవుల నుంచి పచ్చని పల్లెలకు వెళ్లే ప్రతి ఒక్కరూ తమ మూలాలను గౌరవించినప్పుడే ఈ పండుగకు సార్థకత లభిస్తుంది. నేటి డిజిటల్ యుగంలో బంధాలు లైక్‌లు, కామెంట్లకు పరిమితం కాకుండా, కంటిపాపల ఎదురుగా కూర్చుని ముచ్చటించుకునేలా సంక్రాంతి ఉండాలని ఆశిస్తూ..

**- విద్యారాణి పూరడి**

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.